B9 NEWS
నిజం - మా ఇజం

మన.. ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం...




PUBLISHED FROM: Telangana & Andhrapradesh | సంపుటి : 01 | సంచిక : 252 | ఆదివారం | 04-10-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-



## డే పాస్‌తో ప్రయాణించిన మంత్రులు

- ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ కొనుగోలు చేసి ప్రయాణించిన తెలంగాణ మంత్రులు
- డే పాస్‌తో ఆర్టీసీ బస్సు, మెట్రో రైలులో ప్రయాణించిన మంత్రులు
- బస్సులో బేగంపేట మెట్రోకు చేరుకున్న మంత్రులు
- జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వరకు మెట్రో రైలులో ప్రయాణం

మన ప్రజాపక్షం,హైదరాబాద్

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పలువురు మంత్రులతో కలిసి ఈరోజు మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ రవాణాను మరింత సులభతరం చేయడం కోసం ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ తీసుకొచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో దీనిని ఆటోలు,

## తెలంగాణలో అక్టోబర్ 10 నుంచి 18 వరకు ఘనంగా బతుకమ్మ వేడుకలు

### పిల్లల ఆన్‌లైన్ భద్రతకు
# ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్

- ఆన్‌లైన్‌లో పిల్లల సేఫ్టీ.. అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- మహిళలు, పిల్లల రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని వెల్లడి
- సైబర్ క్రైమ్‌కు 1930, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు 1098 నంబర్లు గుర్తుంచుకోవాలని సూచన



మన ప్రజాపక్షం,హైదరాబాద్

డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం ఒక సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ లీగల్ సర్వీసెస్

## ఆస్పత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి

**విద్య,వైద్య శాఖలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి**

**విద్య, వైద్య శాఖలపై సీఎంవో అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలల్లో సౌకర్యాల కల్పనపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు.**



మన ప్రజాపక్షం,హైదరాబాద్

ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను గుర్తించి నియామక ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది కొరత లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజును ఆదేశించారు.



## వదంతులు నమ్మొద్దు

**నా పోటీ హుజూర్‌నగర్ నుంచే..మంత్రి ఉత్తమ్**

- వచ్చే ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేసిన ఉత్తమ్
- తుంగతుర్తి నియోజకవర్గానికి మారుతున్నాననే వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి
- కాళేశ్వరం డిజైన్ లో లోపాలు ఉంటే ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందని వెల్లడి

మన ప్రజాపక్షం,హైదరాబాద్

తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తుంగతుర్తికి మారవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి

## 'ఆ ఎన్నికలన్నీ చట్టవిరుద్ధమే


'ఆ ఎన్నికలన్నీ చట్టవిరుద్ధమే

**కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సంచలన డిమాండ్**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంచలన ఆరోపణలు

### రాష్ట్రంలో కాంగ్రెస్
# శకం ముగిసింది

- నర్సాపూర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్ నేతలు
- రోడ్ల మరమ్మతులు కూడా చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు
- ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ లేని సిటీ అని ఎద్దేవా





## వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదో తెలియదు

**వచ్చే ఎన్నికల్లో పోటీ అంశంపై ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదో తెలియదు అని వ్యాఖ్యానించారు**

### నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకే
# ఓట్ల తొలగింపు

- ఎన్నికల సంఘాన్ని కేంద్రం గుప్పిట్లో పెట్టుకుందని వీహెచ్ విమర్శ
- రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగమే ఓట్ల తొలగింపు అని మండిపాటు
- ఓబీసీల గణన చేపట్టడం లేదని ఆగ్రహం



# మమతా బెనర్జీకి మరో షాక్

- రెండు పార్లమెంటరీ కమిటీల చైర్మన్ పదవులను కోల్పోయిన టీఎంసీ
- మమత నేతృత్వంలోని టీఎంసీకి వరుస ఎదురుదెబ్బలు
- రెండు కీలక పార్లమెంటరీ కమిటీల చైర్మన్ పదవులకు దూరమైన తృణమూల్
- వారి స్థానంలో బీజేపీ, తృణమూల్ తిరుగుబాటు ఎంపీకి బాధ్యతలు



మన ప్రజాపక్షం,ఢిల్లీ

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. పార్టీలో చీలిక, అగ్రనేతలపై దాడులు, అలాగే కీలక నేతల రాజీనామాలతో సతమతమవుతున్న తృణమూల్‌కు తాజాగా మరో ఎదురుదెబ్బ తగిలింది. రెండు కీలక పార్లమెంటరీ కమిటీల చైర్మన్ పదవులను తృణమూల్ కాంగ్రెస్ కోల్పోయింది. రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శనివారం నాడు వివిధ శాఖలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలను పునర్వ్యవస్థీకరించడంతో ఈ ఎదురుదెబ్బ మమతా పార్టీకి తగిలింది.వాణిజ్య వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ చైర్మన్‌గా టీఎంసీకి చెందిన డోలా సేన్ స్థానంలో బీజేపీ నేత సుధాన్షు త్రివేది నియమితులయ్యారు. అలాగే రసాయనాలు, ఎరువుల కమిటీ చైర్మన్‌గా టీఎంసీలోని అసమ్మతి వర్గానికి చెందిన కకోలి ఘోష్ దస్తీదార్ ఎంపికయ్యారు. టీఎంసీ నేత కీర్తి ఆజాద్ స్థానంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. పరిశ్రమల కమిటీకి తిరుచి శివ (డీఎంకే), ఆహారం,

# మీరు చెప్పేది మేం వింటాం..
# ఇదిగో సత్యాగ్రహ వెబ్ సైట్

**సీఎం రేవంత్ రెడ్డి**

- 'సత్యాగ్రహ' పేరుతో కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించిన రాహుల్ గాంధీ
- దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు, ఉద్యమాలను ఏకతాటిపైకి తేవడమే లక్ష్యం
- ప్రత్యేక వెబ్‌సైట్‌లో తమ ఉద్యమ వివరాలు నమోదు చేసేందుకు అవకాశం
- ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చిన సీఎం రేవంత్ రెడ్డి




మన ప్రజాపక్షం,హైదరాబాద్

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఒక కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా వివిధ సమస్యలపై పోరాడుతున్న వారి గొంతుకలను ఏకం చేసే లక్ష్యంతో 'సత్యాగ్రహ' పేరుతో ఒక కొత్త

All are Continues Second Page

## డే పాస్‌తో ప్రయాణించిన మంత్రులు

మొదటి పేజీ తరువాయి

క్యాబ్‌లకు అనుసంధానించే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు.శనివారం డే పాస్‌తో మంత్రులతో కలిసి ఆయన ఆర్టీసీ బస్సులో బేగంపేట మెట్రో స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా తనతో పాటు ప్రయాణించిన మంత్రులకు, భట్టి విక్రమార్క కాంబో పాస్ కొనుగోలు చేశారు.హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడం, ప్రజా రవాణా వైపు ప్రయాణికులను ఆకర్షితులను చేయడం కోసం ఈ పాస్ తీసుకొచ్చినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ప్రస్తుతం వీటిని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చూస్తామని తెలిపారు. కాంబో పాస్‌పై ప్రయాణించిన మంత్రుల్లో వివేక్, అజారుద్దీన్ తదితరులు ఉన్నారు.

## వదంతులు నమ్మొద్దు

మొదటి పేజీ తరువాయి

హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.ఈరోజు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి... తన నియోజకవర్గం మార్పుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అంతమాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తాననడం అవాస్తవమని తెలిపారు.ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణలో డిజైన్‌కు సంబంధించిన లోపాలుంటే, ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అయితే, నిర్మాణ ఏజెన్సీల పరిధిలోకి వచ్చే సమస్యలు ఏవైనా ఉంటే, వాటిని ఆయా సంస్థలే సొంత ఖర్చుతో సరిచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది

మొదటి పేజీ తరువాయి

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు మాజీ మంత్రి హరీశ్ రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిందని అన్నారు.సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణమని వ్యాఖ్యానించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన విమర్శించారు.అభివృద్ధి పనుల వైఫల్యం కారణంగా ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పార్టీలో ఉండటం కంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడమే మేలని భావించి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును ఆయన 'ఫ్యూచర్ లేని సిటీ'గా ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం ఏంటని ఆయన మండిపడ్డారు.

### పిల్లల ఆన్‌లైన్ భద్రతకు

## ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్

మొదటి పేజీ తరువాయి

అథారిటీ (నల్సా) సౌత్ జోన్ రీజనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు.ఆన్‌లైన్‌లో పిల్లలు ఎక్కువ సమయం గడుపుతున్నారని, అక్కడ ఎదురయ్యే ప్రమాదాలపై వారికి సరైన అవగాహన ఉండటం లేదని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థతో సంప్రదింపులు జరిపి ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని సూచించారు. మహిళలు, పిల్లల సంరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఫ్రేమ్‌వర్క్ ద్వారా న్యాయ సేవలను రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సీఎం కీలక సూచనలు చేశారు. పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను గమనించేటప్పుడు తీర్పులిచ్చేలా కాకుండా ఆసక్తిగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. "క్యూరియస్‌గా ఉండండి, జడ్జ్‌మెంటల్‌గా కాదు" అని ఆయన హితవు పలికారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే భరోసా సెంటర్లు, దేశంలోనే మొదటి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు, సైబర్‌హర్ యాప్ వంటివి సమర్థంగా పనిచేస్తున్నాయని సీఎం గుర్తుచేశారు.

## ఆస్పత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి

మొదటి పేజీ తరువాయి

**అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండాలి**

విద్య, వైద్య శాఖలపై సీఎంవో అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి, అధికారులకు కీలక ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యేనాటికి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**ప్రతివారం సమీక్ష నిర్వహించాలి**

కలెక్టర్లతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఆస్పత్రులను సందర్శించాల్సిందేనని స్పష్టం చేశారు. జిల్లాస్థాయిలో ప్రతీ వారం సమీక్ష నిర్వహించాలని నిర్దేశించారు. సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. పాఠశాలల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను చేయాలన్నారు.గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడుల విషయంలో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. త్వరలోనే ఏర్పాట్లను పరిశీలిస్తానని చెప్పారు. ఈ సమీక్షలో ఎంపీ వేంనరేందర్?రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకే

## ఓట్ల తొలగింపు: వీహెచ్

మొదటి పేజీ తరువాయి

నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకే బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి ఓటర్ల జాబితా నుంచి ఓట్లను తొలగించే కుట్రకు పాల్పడుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ ద్వారా ఈ కుట్రను అమలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని (ఈసీ) తన గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపించారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ద్వారా పెద్ద ఎత్తున ఓట్లను తొలగింపజేస్తున్నారని వీహెచ్ అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాలరాసి, కొత్త రాజ్యాంగాన్ని అమలు చేయాలనే దురుద్దేశంతోనే ఇదంతా చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా జనాభా గణన జరుగుతున్నా, అందులో ఓబీసీల ప్రస్తావన లేదని దుయ్యబట్టారు.ఈ అంశంపై పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని వీహెచ్ ప్రకటించారు. రేపు శంషాబాద్‌లో ఓబీసీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టి, 'ఓబీసీ గర్జన'ను ఢిల్లీ వరకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. న్యాయం కోసం పోరాడేందుకు ఇదే చివరి అవకాశమని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుస్తూ కేంద్రం ఓబీసీ గణన చేపట్టేవరకు పోరాటం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

## వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదో తెలియదు

మొదటి పేజీ తరువాయి

పాతబస్తీ రాజకీయాల్లో కీలక నేతగా గుర్తింపు పొందిన ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు తెరలేపాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానో లేదో తెలియదని, ప్రస్తుతానికి ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచన కూడా లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. 'నేను ముసలోడిని అయిపోయాను. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదో తెలియదు. అసలు పోటీ చేయాలనే ఆలోచన కూడా లేదు' అని అన్నారు.

సుదీర్ఘకాలం రాజకీయాల్లో కొనసాగుతూ

అక్బరుద్దీన్ ఓవైసీ ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) పార్టీ శాసనసభాపక్షనేత. చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన వరుసగా శాసనసభ్యుడిగా ఎన్నికవుతున్నారు. 1999లో చాంద్రాయణగుట్ట నుంచి తొలిసారి శాసనసభకు ఎన్నికైన ఆయన 2004, 2009,2014, 2018, 2023 ఎన్నికల్లో విజయం సాధించారు. సుదీర్ఘకాలం పాటు రాజకీయాల్లో కొనసాగిన ఆయన తాజాగా చేసిన వ్యాఖ్యలు రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## తెలంగాణలో అక్టోబర్ 10 నుంచి 18 వరకు ఘనంగా బతుకమ్మ వేడుకలు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, అక్టోబరు 3 : అక్టోబర్ 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు బతుకమ్మ వేడుకలను తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించనుంది. బతుకమ్మ ఏర్పాట్లపై సీఎస్ సంజయ్ జాజు శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. 18వ తేదీన ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ వేడుకలు జరపనుంది. ఈ వేడుకను వేలాది మంది మహిళలతో భారీ బతుకమ్మ ఉత్సవం నిర్వహించనుంది. అమరవీరుల స్మారక కేంద్రం నుంచి ట్యాంక్‌బండ్ వరకు బతుకమ్మలతో ర్యాలీ చేపట్టనుంది.వందలాది మంది కళాకారులతో ప్రత్యేక సంస్కృతిక ప్రదర్శనలను ప్రభుత్వం నిర్వహించనుంది. సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్యాంక్‌బండ్‌పై ఈ వేడుకలు జరగనున్నాయి. ట్రాఫిక్ డైవర్షన్లు, బారికెడ్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేయనుంది. నెక్లెస్ రోడ్, బతుకమ్మ ఘాట్‌ల వద్ద నిమజ్జన ఏర్పాట్లు చేయనుంది. నగరంలోని ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ లైట్లను అలంకరించనుంది. రవీంద్ర భారతిలో పది రోజుల పాటు బతుకమ్మ వేడుకలు నిర్వహించనుంది.రాష్ట్రంలోని టూరిజం కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ ఈ వేడుకలు నిర్వహించనుంది. బతుకమ్మ ఉత్సవాల కోసం ప్రత్యేక లోగో రూపకల్పన చేయనుంది. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026ను ప్రతిబింబించేలా ప్రభుత్వం లోగో రూపకల్పన చేయనుందని సీఎస్ సంజయ్ జాజు పేర్కొన్నారు.



## మీరు చెప్పేది మేం వింటాం.. ఇదిగో సత్యాగ్రహ వెబ్ సైట్

మొదటి పేజీ తరువాయి

వేదికను ఆయన ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోషల్ మీడియా ఖాతా ద్వారా

వెల్లడించారు.దేశవ్యాప్తంగా సత్యం అణచివేతకు గురవుతోందని, దీనికి వ్యతిరేకంగా ప్రజలు తమ గళం విప్పుతున్నారని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. భూమి, మహిళల హక్కులు, దళిత, ఓబీసీల హక్కులు, విద్య, పరీక్షల్లో అక్రమాలు వంటి అనేక అంశాలపై ప్రజలు నిరసనలు తెలుపుతున్నారని తెలిపింది. ఇలా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఉద్యమాలను ఒకే మ్యాప్‌పైకి తీసుకువచ్చి, వాటిని సమన్వయం చేసేందుకు 'సత్యాగ్రహ' కార్యక్రమాన్ని రూపొందించినట్లు రాహుల్ గాంధీ తెలిపారు.ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. తమ సమస్యలు, పోరాటాలకు సంబంధించిన వివరాలను ఈ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, నిర్దేశిత ఫారం నింపడం ద్వారా ఉద్యమకారులు తమ గళాన్ని జాతీయ స్థాయిలో వినిపించేందుకు అవకాశం కల్పించారు.ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళుతూ సీఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. "మీ గళాన్ని మేం వింటాం, మీతో కనెక్ట్ అవుతాం. సత్యం, న్యాయం కోసం మీరు చేస్తున్న పోరాటానికి మా పూర్తి మద్దతు ఉంటుంది. 'సత్యాగ్రహ' వెబ్‌సైట్‌ను సందర్శించి మీ ఉద్యమ వివరాలను నమోదు చేయండి" అని ఆయన పిలుపునిచ్చారు. వివిధ ప్రాంతాల్లో విడివిడిగా జరుగుతున్న స్థానిక ఉద్యమాలకు జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టి, వాటిని బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది.

## మమతా బెనర్జీకి మరో షాక్

మొదటి పేజీ తరువాయి

వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ కమిటీకి కె. కనిమొళి (డీఎంకే) మరోసారి ఛైర్మన్లుగా నియమితులయ్యారు. బీజేపీ మిత్రపక్షాలైన జేడీయూ, శివసేన, తెదేపాలకు చెందిన నాయకులు కూడా వివిధ పార్లమెంటరీ కమిటీల అధిపతులుగా కొనసాగుతున్నారు.

కమిటీలకు ఛైర్మన్లుగా కాంగ్రెస్ సీనియర్ నేతలు

కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ విదేశీ వ్యవహారాల కమిటీ ఛైర్మన్‌గా, మరో అగ్రనాయకుడు చరణ్‌జిత్ సింగ్ చన్నీ వ్యవసాయ కమిటీ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. విద్య, మహిళలు, పిల్లలు, యువజన వ్యవహారాల కమిటీకి హస్తం పార్టీ నాయకుడు ముకుల్ వాస్నిక్, అలాగే ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ కమిటీకి సమాజ్‌వాదీ పార్టీ నేత రామ్ గోపాల్ వర్మ ఛైర్మన్లుగా ఉన్నారు. రక్షణ శాఖ కమిటీకి బీజేపీకి చెందిన రాధా మోహన్ సింగ్ నేతృత్వం వహిస్తున్నారు. రవాణా, టూరిజం, సాంస్కృతిక కమిటీ ఛైర్మన్‌గా జేడీయూకి చెందిన సంజయ్ కుమార్ ఝా తిరిగి నియమితులయ్యారు. ఇంధన శాఖ కమిటీ అధిపతిగా శివసేనకు చెందిన శ్రీరంగ బర్నే కొనసాగుతున్నారు. ప్రజా ఫిర్యాదులు, న్యాయం, చట్టం కమిటీ ఛైర్మన్‌గా కమలం పార్టీ నాయకుడు సుజీత్ కుమార్ నియమితులయ్యారు. గతంలో ఈ కమిటీ ఛైర్మన్‌గా బీజేపీ ఎంపీ బ్రిజ్ లాల్ ఉండేవారు.బొగ్గు, గనులు, ఉక్కు శాఖ కమిటీ అధిపతిగా మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తిరిగి నియమితులయ్యారు. జలవనరుల కమిటీ ఛైర్మన్‌గా బీజేపీకి చెందిన రాజీవ్ ప్రతాప్ రూడీ కొనసాగుతున్నారు. కమలం పార్టీ నేత భర్తృహరి మహతాబ్ ఆర్థిక వ్యవహారాల కమిటీకి అధిపతిగా కొనసాగుతుండగా, అదే పార్టీకి చెందిన రాధా మోహన్ దాస్ అగర్వాల్‌ను హోం వ్యవహారాల కమిటీ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. బీజేపీ సీనియర్ నేత నిశికాంత్ దూబేకు సమాచార ప్రసార, సాంకేతికత కమిటీ అధిపతిగా మరోసారి అవకాశం దక్కింది. మేధా విక్రామ్ కులకర్ణిని సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల కమిటీ ఛైర్‌పర్సన్‌గా మరోసారి అవకాశం కల్పించారు. రైల్వే కమిటీ ఛైర్‌పర్సన్‌గా సీఎం రమేశ్ స్థానంలో బీజేపీకి చెందిన సుధీర్ గుప్తా బాధ్యతలు చేపట్టారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ కమిటీ అధిపతిగా కాంగ్రెస్‌కు చెందిన సప్తగిరి శంకర్ ఉలక తిరిగి నియమితులయ్యారు.

## 'ఆ ఎన్నికలన్నీ చట్టవిరుద్ధమే

మొదటి పేజీ తరువాయి

'సర్' ప్రక్రియ కేంద్రంగా దేశంలో ప్రస్తుతం రాజకీయ పరిణామాలు హాట్ టాపిక్‌గా మారాయి. కేంద్ర ఎన్నికల సంఘంలో సభ్యుల మధ్య అభిప్రాయ భేదాల అంశం, సర్ ప్రక్రియలో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తాజాగా సంచలన ఆరోపణలు చేశారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియపై మాట్లాడిన ఆయన- దేశంలో అన్ని ఎన్నికలు చట్టవిరుద్ధంగానే జరిగాయని ఆరోపించారు. ఈ క్రమంలో లోక్‌సభతో పాటుగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేసి మళ్లీ కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ఈవీఎం పద్ధతిలో కాకుండా ఇప్పుడు బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. శనివారం రోజు కర్ణాటక కలబురగిలో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సహా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఎన్నికలపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.దేశంలో ఎక్కడ ఎన్నికలు నిర్వహించినా ఈవీఎంల దుర్వినియోగం తీవ్ర స్థాయిలో జరుగుతుందని ఖర్గే మండిపడ్డారు. అధికార పార్టీకి చెందిన నేతలే స్వయంగా ఇది చెబుతున్నారని అన్నారు. అధికార బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు వార్డులు, పంచాయతీలు, గ్రామాలకు వెళ్లి ఎక్కువగా పేదలు, గిరిజనులు, దళితులు, మైనార్టీల ఓట్లను కావాలని తొలగిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. సెప్టెంబర్ 30న జరిగిన ఇండియా కూటమి సమావేశాన్ని కూడా ఖర్గే ఈ సందర్భంగా ప్రస్తావించారు. అక్కడ దాదాపు 20 పార్టీల ప్రతినిధులు, ఆయా పార్టీలకు చెందిన లీగల్ సెల్ ప్రతినిధులు పాల్గొనగా, సర్ ప్రక్రియ దేశానికి నష్టం కలిగించేలా సాగుతోందని ప్రతి ఒక్కరూ అంగీకరించినట్లు చెప్పారు.సర్ ప్రక్రియలో పెద్ద ఎత్తు అక్రమాలు జరుగుతున్నాయని, ఇది ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని ఖర్గే వ్యాఖ్యానించారు. ప్రతి పోలింగ్ బూత్‌కు దాదాపు 500 ఓట్ల వరకు తొలగిస్తూ, తమకు అనుకూలమైన వారి పేర్లను కూడా చేరుస్తున్నారని ఖర్గే విమర్శించారు. ఇలా జరిగితే అది నిష్పక్షపాతంగా నిర్వహించిన ఎన్నిక ఎలా అవుతుందని ఖర్గే ప్రశ్నించారు. గతంలో ప్రధానులుగా పనిచేసిన జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి, పీవీ నరసింహారావు, రాజీవ్ గాంధీ కూడా ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు ఎన్నడూ పాల్పడలేదని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే దేశంలో ఎన్నికల ప్రక్రియ, సర్ ప్రక్రియపై ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగుతాయని ఖర్గే తెలిపారు. అక్టోబర్ 6న దిల్లీలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీ నిర్వహిస్తారని స్పష్టం చేశారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి, ప్రతి 3-4 రోజులకు ఓసారి ప్రచారాలు, నిరసనలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. 2023లో ప్రవేశపెట్టిన ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంపైనా ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించి ఆ స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చడం ద్వారా తమకు అనుకూలమైన వ్యక్తులనే నియమించుకుంటున్నారని విమర్శించారు.

**జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయడమే తెలివైన పని: పి. చిదంబరం**

ఇక సర్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చుట్టూ వివాదం మరింత ముదురుతోంది. ఈ క్రమంలో ఆయన రాజీనామా చేయడం మినహా మరో మార్గం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం అన్నారు. ప్రతిపక్షాల ఒత్తిడి కారణంగా సీఈసీ ఏదో ఒక రోజు వైదొలగాల్సిందేనని, కాబట్టి తక్షణమే రాజీనామా చేయడమే తెలివైన నిర్ణయం అని స్పష్టం చేశారు. లేకపోతే తమ నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సర్ నిర్వహణలో ఎన్నికల కమిషనర్లకు చట్టవిరుద్ధమైన ఆదేశాలు ఇచ్చారని చిదంబరం మండిపడ్డారు. ప్రస్తుతం సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తున్నామని, ఇతర కమిషనర్ల పాత్రపై అనుమానాలు వచ్చినా, ఆధారాలు లభించినా వారి రాజీనామాపై కూడా పోరాటం చేస్తామని తెలిపారు.




# క్రీడలతో శారీరక ఆరోగ్యం.. మానసిక ఉల్లాసం.. క్రమశిక్షణ

**చదువుతో పాటు క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలి: మంత్రి జూపల్లి**

కొల్లాపూర్,మన ప్రజాపక్షం:
క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని క్రీడల ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని ఎల్లూరులో క్రీడా మైదానం అభివృద్ధి పనులకు శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు.ప్రతిభావంతులైన క్రీడాకారులు మారుమూల ప్రాంతాలకే పరిమితం కాకుండా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభను చాటాలని మంత్రి సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం రోజుకు కనీసం ఒక గంట వ్యాయామానికి కేటాయించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా వసతులను మెరుగుపరిచి యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.




# గురుకులంలో మౌలిక వసతుల మెరుగుదలకు తక్షణ చర్యలు

**విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన పనులు చేపట్టాలి**

అచ్చంపేట, మన ప్రజాపక్షం:
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోని లింగాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని శనివారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గురుకుల విద్యాలయ ప్రాంగణంలో జేసీబీ సహాయంతో చేపడుతున్న పరిసరాల శుభ్రత పనులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న వసతులు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, టాయిలెట్లు, భవనాల పరిస్థితి తదితర మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.గురుకులంలోని టాయిలెట్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు పాత భవనాలకు పెయింటింగ్ వేయించాలని, అవసరమైన చోట్ల భవనాల మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం అధికారుల బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. గురుకులంలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులను మెరుగుపరచి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.కలెక్టర్ వెంట ఎమ్మార్వో వెంకటేష్,లింగాల గ్రామ సర్పంచ్ ఈశ్వరమ్మ, సంబంధిత అధికారులు ఉన్నారు.




# ఇప్పలగడ్డలో ఘనంగా ఉచిత వైద్య శిబిరం

జనగామ, మన ప్రజాపక్షం:
ఇప్పలగడ్డ గ్రామపంచాయతీ ఆవరణంలో గ్రామ సర్పంచ్ దారావత్ రాజమణి (రాజు నాయక్) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ శిబిరానికి వచ్చిన వైద్యులు గ్రామ ప్రజలకు బీపీ, షుగర్, జ్వరం, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులకు సంబంధించి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ రాజమణి (రాజు నాయక్) మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా వస్తున్నందున ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎం సరిత, విజయ ఆశా వర్కర్ ప్రేమలత గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'తొలిముద్ద'తో చిన్నారులకు పౌష్టికాహారం

**అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్పాహార పథకాన్ని ప్రారంభించిన మంత్రి**

కొల్లాపూర్,మన ప్రజాపక్షం:
చిన్నారుల ఎదుగుదలకు తొలిదశ నుంచే పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్పాహార పథకం 'తొలిముద్ద' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అల్పాహార 'తొలిముద్ద' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలకు అల్పాహారాన్ని మంత్రి జూపల్లి స్వయంగా తినిపించారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ మూడు నుంచి ఆరేళ్ల చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి పౌష్టికాహారం ఎంతో కీలకమని అన్నారు. చిన్నారులకు ఉదయం అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని



మెరుగుపరచడంతో పాటు పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. అక్టోబరు 1 నుంచి నాగర్‌కర్నూల్‌తో పాటు రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో తొలిదశలో 'తొలిముద్ద' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు.పౌష్టికాహారంతో పాటు ప్రీ-స్కూల్ విద్య అందించడం ద్వారా చిన్నారుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో 'తొలిముద్ద' కార్యక్రమం సక్రమంగా అమలయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిదండ్రులు సహకరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు.

# గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులు

**రూ.2.50 కోట్లతో ఎస్టీ బాలుర వసతిగృహ నిర్మాణానికి మంత్రి జూపల్లి శంకుస్థాపన**

కొల్లాపూర్,మన ప్రజాపక్షం:గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు, నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పర్యాటక,సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలో రూ. 2.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఎస్టీ బాలుర వసతిగృహం నూతన భవనానికి శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు విద్యలో ముందుకు సాగేందుకు అవసరమైన అన్ని వసతులను కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. విద్యార్థుల చదువుకు అనుకూలమైన వాతావరణం, సురక్షితమైన వసతి, నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంటే వారు మరింత మెరుగ్గా విద్యనభ్యసించగలరని అన్నారు.గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని గిరిజన విద్యార్థులకు విద్యా అవకాశాలను మెరుగుపరిచి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. హాస్టళ్లలో భవనాలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి పోటీ ప్రపంచంలో రాణించేలా ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు. విద్యతోనే సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు.కొల్లాపూర్‌లో నిర్మించనున్న నూతన ఎస్టీ బాలుర వసతిగృహం అందుబాటులోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు మెరుగైన వసతి సదుపాయాలు కలగనున్నాయని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



# ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం

**సాగు విధానం, నీటి లభ్యతపై రైతులతో వివరాలు తెలుసుకున్న జిల్లా కలెక్టర్**

అచ్చంపేట,మన ప్రజాపక్షం:ఆయిల్‌ఫామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా మెరుగైన ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటగా ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు.శనివారం అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండలం పోలిశెట్టిపల్లి గ్రామంలో రైతులు శ్యాంసుందర్ రెడ్డి, హనుమంత రెడ్డి తమ 8 ఎకరాల వ్యవసాయ భూమిలో ఆయిల్‌ఫామ్ సాగు కోసం తీసుకువచ్చిన 400 మొక్కలను ఏర్పాటు చేస్తున్న విధానాన్ని అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆయిల్‌ఫామ్ సాగుకు అవసరమైన నీటి లభ్యత, మొక్కల నాటే విధానం, మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న జాగ్రత్తలు, ఇప్పటివరకు అయిన వ్యయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఆయిల్‌ఫామ్ సాగులో శాస్త్రీయ



పద్ధతులను పాటిస్తూ మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.అనంతరం పోలిశెట్టిపల్లి క్లస్టర్ రైతు వేదికలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై జరిగిన కార్యక్రమాన్ని వీక్షించారు.అనంతరం వీరాంజపల్లి గ్రామంలో సెంట్రల్ కిచెన్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తోటల సాగు, పెంపకానికి అనువైన స్థలాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన,పౌష్టికాహారాన్ని అందించడమే లక్ష్యంగా రాష్ట్రంలో సెంట్రల్ కిచెన్‌ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను స్థానికంగా సాగు చేసి వినియోగించుకునే విధంగా ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, అచ్చంపేట డివిజన్ వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

# పత్తి రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించాలి

**ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి**
**రైతులతో పైసలు వసూలు చేయకూడదు**
**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**


నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్‌కర్నూల్ జిల్లాలో పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పత్తి కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సీసీఐ మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు.శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి సీసీఐ అధికారులు, మార్కెటింగ్, వ్యవసాయ, రవాణా, అగ్నిమాపక శాఖల అధికారులు, జిన్నింగ్ ప్రెస్సింగ్ మిల్లుల యజమానులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు ప్రభుత్వ ప్రకటించిన కనీస మద్దతు ధర వివరాలను కలెక్టర్‌కు వివరించారు. లాంగ్ స్టేపుల్ పత్తికి క్వింటాల్‌కు రూ.8,667, మీడియం స్టేపుల్ పత్తికి రూ.8,267గా కనీస మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు.గతంలో లాంగ్ స్టేపుల్ పత్తికి ఉన్న రూ.8,110తో పోలిస్తే రూ.557 పెరుగుదల ఉందన్నారు. రైతులు కపాస్కా కిసాన్ పోర్టల్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటే భారత పత్తి సంస్థ (సీసీఐ)నిబంధనల ప్రకారమే పత్తి కొనుగోళ్లు చేపట్టనున్నట్లు సమావేశంలో చర్చించారు.జిల్లాలో ఈ ఏడాది సుమారు 2.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా, సుమారు 2.60 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ గణాంకాల ఆధారంగా అధికారులు తెలిపారు.జిల్లాలోని మొత్తం 19 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.రైతులకు కనీస మద్దతు ధరకు అనుగుణంగా పత్తి విక్రయించే అవకాశం కల్పించడంతో పాటు కొనుగోలు ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని ఆదేశించారు. పత్తి నాణ్యత, తూకం, తేమ శాతం తదితర అంశాలపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని, దళారులపై ఆధారపడకుండా అధికారిక కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి విక్రయించేలా అవగాహన కల్పించాలని సూచించారు.పత్తి మార్కెటింగ్ సీజన్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్, రవాణా, అగ్నిమాపక, విద్యుత్, మార్కెటింగ్, వ్యవసాయ, న్యాయ కొలతల శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిన్నింగ్ మిల్లుల్లో అగ్నిప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు, విద్యుత్ సరఫరా, రవాణా సౌకర్యాలు, తూకం యంత్రాల ఖచ్చితత్వం తదితర అంశాలను సంబంధిత అధికారులు ముందుగానే పరిశీలించాలని తెలిపారు.పత్తి రైతులతో పత్తి మాత్రమే




తీసుకోవాలని, హమాలీలు అని లేదా ఏ ఇతర అవసరమకైనా ఏ ఒక్క పత్తి రైతుతో డబ్బులు వసూలు చేసే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.జిన్నింగ్ మిల్లుల యజమానులు సమావేశంలో పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యలను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి బి.నాగేంద్ర, సీసీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అనీషా,జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు,జిల్లా రవాణా అధికారి ఇమ్రాన్ మహమ్మద్, జిన్నింగ్ మిల్లుల యజమానులు, ఏఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ గిరి దేవాలయాన్ని దర్శించుకున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మంతటి నారాయణ కుటుంబ సభ్యులు

అచ్చంపేట,మన ప్రజాపక్షం:స్వర్ణ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించామని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, అచ్చంపేట డివిజన్ విశ్రాంత ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షులు మంతటి నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర గురించి తెలుపుతూ ఆర్త జన రక్షకుడు, పిలిస్తే పలికే దేవదేవుడు, భక్తుల పాలిట కొంగు బంగారం,వడ్డీ కాసులవాడు ఇలా వెంకటేశ్వర స్వామిని భక్తులు వేల పేర్లతో పిలుస్తారన్నారు. మనసారా నమ్మి కొలుస్తారు అన్నారు. ఆ స్వామి ఇప్పుడు 16 అడుగుల్లో పసిడి కాంతులతో అభయ వరద ముద్రలతో దర్శనమిస్తున్న క్షేత్రమే స్వర్ణ గిరి అన్నారు. వెంకన్న సప్తగిరిలు దాటి స్వర్ణ గిరిలో కొలువదీరాడ అని భక్తులు తన్మయత్వము చెందేల కనిపించే ఆయన రూపం అన్నారు. ఈ దేవాలయం రెండు సుందరం నయా ఆనందమన్నారు. స్వర్ణ గిరి అల వైకుంఠాన్ని పోలిన నిర్మాణంతో 22 ఎకరాల్లో కట్టిన అద్భుతమైన శ్రీవారి దివ్యధామ మన్నారు. పేరుకు తగినట్లుగానే ఇక్కడ స్వామి స్వర్ణమైన కాంతులతో విరాజిల్లుతూ భక్తులకు దర్శనమిస్తారు అన్నారు. అడుగడుగునా ఆధ్యాత్మిక ఉట్టి పడుతుందన్నారు. వెంకట నాథుడు కొలువుదీరిన ఈ ఆలయము తెలంగాణలోని భువనగిరి జిల్లా శివారులోని మానేపల్లి గుట్టల పైన ఉందన్నారు. పల్లవ,చోళ, చాళుక్య, వయాసుల, విజయనగర, కాకతీయ రాజులు నిర్మించిన ఎన్నో ఆలయాల వైభవాన్ని స్ఫూర్తిగా తీసుకొని రూపొందించిన ఈ స్వర్ణ గిరి నిర్మాణం వెనుక ఆసక్తికరమైన కథ ఉందన్నారు. ఈ క్షేత్రాన్ని మానెపల్లి జ్యువెలర్స్ యజమాని మానేపల్లి రామారావు నిర్మించారన్నారు. వెంకటేశ్వర స్వామికి పరమ భక్తుడైన రామారావు తన షష్టిపూర్తి అయ్యాక వ్యాపార వ్యవహారాలన్నీ పిల్లలకి అప్పగించి విశ్రాంత జీవితాన్ని స్వామి సేవకు అంకితం చేయాలనే ఆలోచనతో 2013లో ఇక్కడ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టాడన్నారు. ఆ పనులు మొదలుపెట్టిన అవి వేగంగా సాగగా ఆపేశారన్నారు. ఇది జరిగిన మూడేళ్లకు రామారావు సతీమణి విజయలక్ష్మి లిఫ్ట్ కూలడంతో ప్రమాదానికి గురై కోమస్థితికి చేరుకోవడంతో కోలుకోవడం కష్టమన్నారు



వైద్యులు. ఆమె ఆసుపత్రిలో ఉన్నప్పుడు రామారావు కుమారుడి స్నేహితుడు తిరుపతి నుంచి వస్తూ స్వామివారి ప్రసాదాన్ని అందించారన్నారు. అప్పుడు తన భార్య త్వరగా కోలుకుంటే ఎలాగైనా ఆలయాన్ని నిర్మిస్తానంటూ మొక్కుకున్నారు రామారావు.చాలా తక్కువ సమయంలోనే ఆవిడ కోలుకోవడంతో ఇదంతా వెంకటేశ్వర స్వామి దయవల్లే జరిగిందని భావించిన రామారావు కుటుంబం 2016లో రెండవసారి శంకుస్థాపన చేసి తపతి డి ఎల్ వి ప్రసాద్ సూచనలతో ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించారన్నారు.ఇది పూర్తయ్యేందుకు ఎనిమిదేళ్లు పట్టిందని అన్నారు. రామారావు కుటుంబ సభ్యులు పాంచరాత్ర, ఆగమ తెన్నాచార్య సంప్రదాయాలను అనుసరిస్తూ నిర్మించిన ఆలయం తెలంగాణలోని యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి దేవాలయానికి వెళ్లే మార్గంలో హైదరాబాద్ భూపాలపట్నం జాతీయ రహదారి దగ్గరగా ఉందన్నారు. అల్లంత దూరం నుంచి కనిపిస్తున్న నాలుగు గోపురాలతో ఆకట్టుకుంటూ స్వాగత తోరణంతో బ్రహ్మరథంతో భక్తులను స్వాగతిస్తుందన్నారు స్వర్ణ గిరి.అది దాటితే నాలుగు అడుగుల ఎత్తులో శ్రీవారి పాదాలు దర్శనం ఇస్తాయన్నారు. వాటిని తనివి తీర స్మరించి అక్కడ నుండి 108 మెట్లు ఎక్కి లోపలికి చేరుకోవాలన్నారు. అలా వెళ్లే క్రమంలో దశావతారాల రూపాలు గోడల పైన రాసిన గోవింద నామాలు ఆకట్టుకుంటాయన్నారు వాటిని పట్టిస్తూ ముందుకు సాగే భక్తులు ఆనంద మండపంలో పసిడి గోపురం నీడన సుమారు 100 కేజీల నవరత్న ఖచిత స్వర్ణమణిమయ ఆభరణాలను దాల్చి 16 అడుగుల్లో వెంకటేశ్వర స్వామి దర్శనమిస్తారన్నారు.తిరుమల తరహాలోని నిత్య కైంకర్యాలను ఆదుకుంటున్న శ్రీవారితో పాటుగా శ్రీదేవి, భూదేవిలను కూడా పూజించవచ్చన్నారు. తర్వాత అలివేల మంగ, గోదాదేవి,మధ్వన గోపాలకృష్ణ స్వామి, గరుడల్వార్, రామానుజాచార్య, లక్ష్మీనరసింహస్వామి, భూవరహా స్వామి, వకుల మాతలు కొలువై ఉపలయాలను చూడొచ్చన్నారు. భక్తులు తిరుమలను దర్శించుకున్న అనుభూతిని కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ ఆలయాన్ని నిర్మించారన్నారు. తూర్పు వైపున హంపి రథంపై 27 అడుగుల్లో కార్యసిద్ధి హనుమాన్ విగ్రహము భక్తుల్ని ఆకట్టుకుంటుందన్నారు. ఆ పక్కనే 1500 కిలోల బరువైన భారజయ గంట కనిపిస్తుంది అన్నారు.తిరుమల తర్వాత అలాంటి జయగంట ఇక్కడే ఉండటం విశేషం అన్నారు. పశ్చిమ వైపున 100 అడుగుల స్తంభం పైన 15 అడుగుల్లో పంచలోహ గరుడల్వార్ ను దర్శించుకోవచ్చు అన్నారు. అలాగే విమాన గోపురాన్ని, విమానం వెంకటేశ్వర స్వామి, అద్దాల మండపాన్ని చూసి తీరాల్సిందేనన్నారు. నాలుగు మండపాల మధ్యన 10, చదరపు గజాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన పుష్కరిణిలో శ్రీమన్నారాయణ నుడు శయన రూపంలో కనిపిస్తూ జల నారాయణస్వామిగా భక్తులచే పూజలు అందుకుంటున్న అన్నారు. ఈ కార్యక్రమంలో మంతటి రమణమ్మ, మంతటి శ్రవణ్ కుమార్,మంతటి కల్పన,మంతటి ఉదయ్ కుమార్, మంతటి మధుప్రియ, మంతటి రోషన్, మంతటి హేమలతలు పాల్గొన్నారు.




# పీఎం సూర్య ఘర్ అవగాహన సదస్సు

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం 'పీఎం సూర్య ఘర్–ముఫ్త్ బిజిలి యోజన'లో భాగంగా 'సేవా సేతు అభియాన్' అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు. విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ సంపత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ?ఈ సందర్భంగా సోలార్ ఎనర్జీ మరియు బ్యాంకింగ్ రంగ ప్రతినిధులు హాజరై, రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు సమగ్రంగా వివరించారు.ముఖ్యంగా రూఫ్‌టాప్ సోలార్ అమర్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తు విధానం, బ్యాంకుల ద్వారా లభించే సులభతర రుణాలు మరియు నెట్ మీటరింగ్ ప్రక్రియలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఆసక్తి కలిగిన వినియోగదారులు వెంటనే రూఫ్‌టాప్ సోలార్ రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి ఇక్కడ సౌకర్యం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. ?ఈ అవగాహన సదస్సులో మున్సిపల్ వైస్ చైర్మన్, స్థానిక కౌన్సిలర్లు, విద్యుత్ శాఖ అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సోలార్ సంస్థల ప్రతినిధులతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో మరోసారి ఎంపీ డా.కడియం కావ్యకి చోటు

**వైద్యురాలిగా, ఎంపీగా ప్రజారోగ్య అంశాలపై మరింత కృషి చేస్తున్న వరంగల్ ఎంపీ**
**క్యాన్సర్ స్క్రీనింగ్, ఆధునిక వైద్య సాంకేతికత, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాను**

జనగామ,మన ప్రజాపక్షం:
వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, డాక్టర్ కడియం కావ్యకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (2026-27)లో సభ్యురాలిగా మరోసారి అవకాశం లభించింది. 2026 సెప్టెంబర్ 26 నుంచి ఈ కమిటీలో ఎంపీ డా.కడియం కావ్య సభ్యురాలిగా నామినేట్ అయినట్లు రాజ్యసభ సెక్రటేరియట్ అధికారికంగా తెలియజేసింది. ఈ మేరకు రాజ్యసభ సెక్రటేరియట్ డైరెక్టర్ (హెల్త్ ఉ ఫ్యామిలీ వెల్ఫేర్) భూపేంద్ర భాస్కర్ అక్టోబర్ 3న ఎంపీ డాక్టర్ కడియం కావ్యకి అధికారిక లేఖ పంపారు.ఇప్పటికే ప్రజారోగ్యానికి సంబంధించిన పలు అంశాలను డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్‌లో ప్రస్తావించారు. ముఖ్యంగా పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందుపై దేశవ్యాప్తంగా నిషేధం విధించాలని 2026 మార్చి 27న లోక్‌సభలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పారాక్వాట్ వినియోగం వల్ల కలుగుతున్న ఆరోగ్య ప్రమాదాలను ప్రస్తావిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు చేశారు. ఈ మేరకు కేంద్రం ప్రభుత్వం గడ్డి మందును పూర్తిగా నిషేధించింది.అదేవిధంగా క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు స్క్రీనింగ్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, కృత్రిమ మేధస్సు ఆధారిత వైద్య విధానాలను ప్రోత్సహించడం వంటి అంశాలపై కూడా డాక్టర్ కడియం కావ్య ప్రత్యేకంగా దృష్టి సారించారు.క్యాన్సర్ చికిత్స కంటే ముందుగా క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశాలు పెరుగుతాయని, గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో కూడా నాణ్యమైన క్యాన్సర్ స్క్రీనింగ్ అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ముఖ్యంగా మహిళలు, గ్రామీణ ప్రజలు మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సులభంగా స్క్రీనింగ్ అందేలా జాతీయ స్థాయిలో మరింత బలమైన వ్యవస్థ అవసరమని ఎంపీ కోరుతున్నారు.



**క్యాన్సర్ స్క్రీనింగ్‌పై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టాలి**
హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీలో తనకు అవకాశం కల్పించినందుకు డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వానికి, పార్లమెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.వైద్యురాలిగా తనకు ఎంతో దగ్గరైన ప్రజారోగ్య రంగంలో పార్లమెంటరీ స్థాయిలో మరింత బాధ్యతగా పనిచేసే అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేలా దేశవ్యాప్తంగా క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక సాంకేతికత, ఏఐ ఆధారిత స్క్రీనింగ్ మరియు డయాగ్నస్టిక్ విధానాలను అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కూడా అత్యాధునిక వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను అని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు.ప్రజారోగ్యం, వ్యాధుల నివారణ, క్యాన్సర్ స్క్రీనింగ్, ఆధునిక వైద్య సాంకేతికత, వైద్య సేవల అందుబాటు, ఆరోగ్య మౌలిక వసతుల బలోపేతం వంటి అంశాలను కమిటీ ద్వారా జాతీయ స్థాయిలో మరింత బలంగా ప్రస్తావించేందుకు కృషి చేస్తానని ఎంపీ డా.కడియం కావ్య తెలిపారు.వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల తరఫున పార్లమెంట్‌లో ఆరోగ్య హక్కు కోసం మరింత బలంగా తన గళం వినిపిస్తానని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

# గిన్నిస్ రికార్డుల్లో జనగామ మహిళలు

**12.18 కిలోమీటర్ల చేతి అల్లికల జాతీయ పతాకాలతో ప్రపంచ చరిత్ర!**



జనగామ,మన ప్రజాపక్షం:
జనగామకు చెందిన కోటోజు మోహన కుమారి (తండ్రి: కోటోజు వెంకటేశ్వర్లు) మరియు ఆమె స్నేహితురాలు సుశ్మిత (తండ్రి: పుల్లయ్య) మహిళా మనోవికాస్ బృందంలో భాగస్వాములై అరుదైన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రేరణతో, ప్లాస్టిక్ రహిత వాతావరణాన్ని ప్రోత్సహించడం మరియు మహిళా సాధికారతను చాటిచెప్పడమే లక్ష్యంగా "హర్ ఘర్ తిరంగా" పేరుతో ఈ విశిష్ట ప్రాజెక్ట్‌ను చేపట్టారు.ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా మొత్తం 350 మంది మహిళా సభ్యులు సమిష్టిగా పాల్గొని, 47,000 క్రోషే (చేతి అల్లిక) జాతీయ పతాకాలను అత్యంత నైపుణ్యంతో తయారు చేశారు. అనంతరం వీటన్నింటినీ 12.18 కిలోమీటర్ల సుదీర్ఘ పొడవైన బంటింగ్‌గా అమర్చి ప్రపంచ రికార్డును నెలకొల్పారు. భారతీయ సంప్రదాయ హస్తకళకు, మహిళల ఐక్యతకు మరియు దేశభక్తికి అద్దం పట్టేలా సాగిన ఈ ప్రయాణంలో మోహన కుమారి, సుశ్మితల స్నేహం, పరస్పర ప్రోత్సాహం ఎంతగానో దోహదపడ్డాయి. ఈ ఘనత కేవలం ఒక రికార్డు సాధనకు మాత్రమే పరిమితం కాకుండా పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నివారణ మరియు మహిళా సృజనాత్మకతకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిపెట్టింది. జాతీయ జెండా పట్ల గౌరవాన్ని, చేనేత-హస్తకళల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన జనగామ ముద్దుబిడ్డల సమిష్టి కృషిని స్థానికులు మరియు పలువురు ప్రముఖులు అభినందించారు.

# అర్హులైన పట్టభద్రులు ఫారం–18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలి

**రాజకీయ పార్టీల ప్రతినిధులు పట్టభద్రుల ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలి**
**పాత జాబితాలో పేరు ఉన్నా కొత్తగా నిర్దేశిత విధానంలో దరఖాస్తు తప్పనిసరి**
**ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి**
**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

జనగామ, మన ప్రజాపక్షం:
అర్హులైన పట్టభద్రులు ఫారం–18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలి అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వరంగల్–ఖమ్మం–నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో పట్టభద్రులైన ఓటర్లు ఓటరుగా నమోదు చేసుకోవడంపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం వెలువరించిన నియమ నిబంధనలు, దరఖాస్తు చేసే విధానం, గడువు, తదితర వివరాలను కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులు పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, అర్హులైన పట్టభద్రులు నిర్దిష్ట గడువులోగా ఫారం–18 దరఖాస్తులు సమర్పించేలా సహకరించాలని తెలిపారు.ఓటరు జాబితాల తయారీ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 01–11–2026 నాటికి కనీసం 3 సంవత్సరాల క్రితం డిగ్రీ పూర్తి చేసిన అర్హత కలిగిన అభ్యర్థులు ఫార్మ్ –18 దరఖాస్తును ఏఈఆర్ఓలకు (లేదా) నియమిత అధికారికి సమర్పించాలన్నారు.దరఖాస్తుతో పాటు విద్యార్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, అవసరమైన ఇతర పత్రాలను జత చేయాలని సూచించారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ [https://ceotelangana.nic.in/]ను సందర్శించవచ్చని తెలిపారు.పట్టభద్రుల ఓటరు



జాబితాల నూతన తయారీ ప్రక్రియలో భాగంగా, ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు సైతం నిర్దేశిత విధానం ప్రకారం తిరిగి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పాత ఓటరు జాబితాలో పేరు ఉండటం ఒక్కటే ప్రస్తుత ప్రక్రియలో నమోదుకు సరిపోదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు నిర్దిష్ట విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ఉడుత రవి యాదవ్, భాస్కర్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి రావెల రవి, బీజేపీ పార్టీ ప్రతినిధి బి. జగదీష్, సీపీఎం పార్టీ ప్రతినిధి జోగు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



# చేర్యాల ఏఎంసీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కుమారుడు చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి నియమితులైన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి హార్దిక శుభాకాంక్షలు తెలియజేసిన జనగామ కాంగ్రెస్ పార్టీ నాయకులు.ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్,జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి లింగాల నర్సిరెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మెరుగు బాలరాజు గౌడ్, ఎఎంసి డైరెక్టర్ నామాల శ్రీనివాస్,జిల్లా కాంగ్రెస్ నాయకులు శివరాత్రి కుమార్, మినలపురం శ్రీకాంత్,పెద్ద రాంచర్ల ఇంచార్జి సర్పంచ్ కాలకుంట్ల శ్యామ్, పెంబర్తి ఉప సర్పంచ్ కొండబోయిన రాజు యాదవ్,జనగామ మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మచ్చ కుమార్, నాయకులు అంబాల రఘు, జనగామ మండలం ప్రధాన కార్యదర్శి కందాల చంద్రశేఖర్, బైరగోని రఘు, జనగామ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి దాసరి సతీష్,యశ్వంతపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు బోట్ల హరీష్,రాజు మరియు బచన్నపేట ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు స్మార్ట్
# రేషన్ కార్డులు పంపిణీ

కుంటాల,మన ప్రజాపక్షం:
నిర్మల్ జిల్లా కుంటాల మండలం అంబకంటి గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపెట్టిన అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో కూడిన క్రెడిట్ కార్డ్ సైజు పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామాల్లోని అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా అంబకంటి గ్రామంలో సర్పంచ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు ఈ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రవీణ్,పంచాయతీ కార్యదర్శి సుమన్,గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైన కంకేట గ్రామం

సారంగాపూర్,మన ప్రజాపక్షం:
నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం కంకేట గ్రామం జిల్లాలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైంది. స్థానిక సంస్థల పరిధిలో గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా మరియు పౌర సేవల నిర్వహణలో చూపిన ప్రతిభకు గాను కంకేట గ్రామ పంచాయతీకి ఈ ప్రతిష్టాత్మక గౌరవం దక్కింది.మండల పరిధిలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక పంచాయతీలతో పోటీపడి, అన్ని విభాగాల్లోనూ ఉత్తమ పనితీరు కనబరిచినందుకు గాను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ గుర్తింపు పట్ల గ్రామ సర్పంచ్ సిందికర్ సాహెబ్ రావు, పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు మరియు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## పాదలకూరులో వైసీపీ విస్తృత సమావేశం

### కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కాకాణి పూజిత దిశానిర్దేశం

పొదలకూరు,మన ప్రజాపక్షం:
స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పొదలకూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించింది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితతో పాటు మండలంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డు స్థానాల్లో వైసీపీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గ్రామాల వారీగా సమస్యలను తెలుసుకుని పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించారు.రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతుల సమస్యలు, పంట నష్టపరిహారంపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కాకాణి పూజిత మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు తాను, తన తండ్రి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. కార్యకర్తలు ధైర్యంగా పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో వైసీపీ నాయకులు బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, వాకాటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు గంగవరం లక్ష్మీకళ్యాణి, అంజాద్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9,11వ తరగతుల ప్రవేశాలకు దరఖాస్తు గడువు అక్టోబర్ 15 వరకు పెంపు

జనగామ, మన ప్రజాపక్షం:దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027-28 విద్యా సంవత్సరానికి గాను 9వ మరియు 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహిస్తున్న "లేటరల్ ఎంట్రీ సెలెక్షన్ టెస్ట్-2027" (జెఎన్వి ఎల్ఈఎస్టి -2027) ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును అక్టోబర్ 15, 2026 వరకు పొడిగించినట్లు నవోదయ విద్యాలయ సమితి జవహర్ నవోదయ విద్యాలయం, మామూనూర్, వరంగల్ ప్రిన్సిపాల్ టి రమేష్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాలయాల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులను సమర్థవంతంగా వినియోగించుకోవడంలో భాగంగా ఈ ఖాళీ సీట్లను భర్తీ చేస్తున్నారని, సీబీఎస్ఈ అనుబంధం,ఎన్సీఈఆర్టీ పాఠ్యప్రణాళికతో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో ఉచిత నివాస విద్యను అందించడం నవోదయ పాఠశాలల ప్రత్యేకత అని పేర్కొన్నారు.

**అర్హతల వివరాలు**

9వ తరగతి ప్రవేశానికి:వయోపరిమితి: విద్యార్థి 01-05-2012 నుండి 31-07-2014 మధ్య జన్మించి ఉండాలి (రెండు తేదీలూ వర్తిస్తాయి).విద్యార్హత: ప్రస్తుతం (2026--27 విద్యా సంవత్సరంలో) సంబంధిత జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదువుతూ ఉండాలి.

**11వ తరగతి ప్రవేశానికి**

వయోపరిమితి: విద్యార్థి 01-06-2010 నుండి 31-07-2012 మధ్య జన్మించి ఉండాలి.విద్యార్హత: ప్రస్తుతం (2026-27 విద్యా సంవత్సరంలో) సంబంధిత జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి చదువుతూ ఉండాలి.

**ముఖ్యమైన వివరాలు ఉ రిజర్వేషన్లు**

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15-10-2026, ఎంపిక పరీక్ష తేదీ: 10-04-2027, సీట్ల కేటాయింపు: మొత్తం సీట్లలో 75% గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, 25% పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయించబడతాయని(చదువులో ఏ కొద్ది భాగమైనా మున్సిపాలిటీ/కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలలో చదివితే పట్టణ విద్యార్థిగా పరిగణిస్తారు).నిబంధనల ప్రకారం ఎస్సి, ఎస్టీ దివ్యాంగులు మరియు బాలికలకు ప్రత్యేక రిజర్వేషన్లు వర్తిస్తాయని అన్నారు.అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు




నవోదయ విద్యాలయ సమితి అధికారిక వెబ్‌సైట్ ద్వారా 9వ మరియు 11వ తరగతులకు ప్రత్యేకంగా అందుబాటులో ఉన్న లింక్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చునని మరింత సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించగలరని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

# జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో విజ్ఞాన సదస్సు

నారాయణపేట,మన ప్రజాపక్షం:జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఏ) నారాయణపేట జిల్లా ఆధ్వర్యంలో గౌరవ కార్యదర్శి ఆదేశాల మేరకు నారాయణపేట పట్టణంలో స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య ఆదితిగా జూనియర్ సివిల్ జడ్జి కె.అవినాష్ హాజరై మాట్లాడుతూ ప్రాథమిక హక్కులు రాజ్యాంగంలో మనకు 6 హక్కులు ఉన్నాయని సమానత్వపు హక్కు, స్వేచ్ఛా హక్కు, దోపిడీని అరికట్టే హక్కు, మత స్వేచ్ఛా హక్కు, సాంస్కృతిక హక్కు, రాజ్యాంగ పరిహారపు హక్కు గురించి వివరించారు.ప్రాథమిక విధులు, హక్కులు మాత్రమే కాదు, భారత పౌరులుగా మనకు 11 విధులు కూడా ఉన్నాయని, దేశాన్ని, జాతీయ జెండాను గౌరవించాలని తెలిపారు.పిల్లలపై లైంగిక వేధింపులు జరిగితే అది పోక్సో చట్టం-2012 కింద తీవ్రమైన నేరమని తెలిపారు. చిన్న పిల్లలను తాకడం,చెడుగా మాట్లాడటం, ఫోటోలు తీయడం కూడా నేరమేనని,ఈ కేసుల్లో కనీసం 20 ఏళ్ల జైలు శిక్ష నుండి జీవిత ఖైదు, అవసరమైతే మరణ శిక్ష వరకు పడుతుందని హెచ్చరించారు. ఎవరికైనా అలాంటి విషయం తెలిస్తే 1098 చైల్డ్ హెల్ప్ లైన్ కి కాల్ చేయాలని సూచించారు. ఎన్డిపిఎస్ చట్టం:గంజాయి, డ్రగ్స్, మత్తు





మందులు వాడటం, అమ్మడం, దాచడం నేరం. దీని కింద 10 నుండి 20 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ. 2 లక్షల వరకు జరిమానా ఉంటుందన్నారు.14 ఏళ్ల లోపు పిల్లలతో హోటళ్లలో, ఇళ్లలో, పొలాల్లో పని చేయించడం నేరం. పని చేయించే వారికి 2 ఏళ్ల జైలు శిక్ష పడుతుంది.లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె.లక్ష్మిపతి గౌడ్ మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం: పేదవారికి, మహిళలకు, పిల్లలకు, వికలాంగులకు కోర్టులో ఉచితంగా లాయర్ ఇస్తారని, కేసు ఖర్చులన్నీ డిఎల్ఎస్ఏ భరిస్తుందని తెలిపారు. సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100కు కాల్ చేయాలని సూచించారు. బాల్య వివాహాలు:18 ఏళ్ల లోపు అమ్మాయికి, 21 ఏళ్ల లోపు అబ్బాయికి పెళ్లి చేయడం నేరం. బాల్య వివాహం చేస్తే 2 ఏళ్ల జైలు శిక్ష పడుతుంది. బాల్య వివాహాలను అందరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. మీకు ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే ప్రతి విద్యార్థితో ఉండవలసిన హెల్ప్‌లైన్ నంబర్లు:1098చైల్డ్ హెల్ప్‌లైన్,181మహిళా హెల్ప్‌లైన్,15100 నల్సా ఉచిత న్యాయ సహాయం,112 అత్యవసర సేవ టోల్-ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. అదేవిదంగా మీ తల్లితండ్రులకు కచ్చితంగా తెలుపాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కె.అవినాష్,లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె.లక్ష్మిపతి గౌడ్, లైసన్ ఆఫీసర్ కృష్ణయ్య గౌడ్,పాఠశాల ప్రినిసిపాల్ పద్మ, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026లో మహబూబ్‌నగర్ జిల్లా పోలీసుల ప్రతిభ

### బ్యాడ్మింటన్ డబుల్స్‌లో రజతం.. లాన్ టెన్నిస్ డబుల్స్‌లో కాంస్యం
### పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించిన జిల్లా ఎస్పీ డి.జానకి

మహబూబ్ నగర్,మన ప్రజాపక్షం:
తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ, హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026లో మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ సిబ్బంది వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు.బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్‌కు చెందిన లింగం, హెడ్ కానిస్టేబుల్, డిఏఆర్ మరియు శేఖర్, హెడ్ కానిస్టేబుల్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ జోడీ రజత పతకం సాధించడం జరిగినది.అదేవిధంగా లాన్ టెన్నిస్ డబుల్స్ విభాగంలో ఇమ్రాన్, హెడ్ కానిస్టేబుల్, డిఏఆర్ మరియు లింగం, హెడ్ కానిస్టేబుల్,డిఏఆర్ జోడీ కాంస్య పతకం సాధించి జిల్లా పోలీస్ శాఖకు గౌరవం తీసుకువచ్చారు.ఈ సందర్భంగా పతకాలు సాధించిన ముగ్గురు పోలీస్ క్రీడాకారులను మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని ఎస్పీ చాంబర్‌లో జిల్లా ఎస్పీ డి.జానకి అభినందించి, ప్రశంసించారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లాకు పతకాలు సాధించడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు.క్రీడలు పోలీస్ సిబ్బందిలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఏకాగ్రత, జట్టు స్ఫూర్తి పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా పోలీస్ శాఖకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.పోలీస్ సిబ్బందిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు వారు



జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచేలా అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు.ఈ కార్యక్రమంలో వర్టికల్ డిఎస్పీ బాలాజీ,ఎస్పీ సీసీ రామ్ రెడ్డి,సీసీఎస్ ఇన్స్పెక్టర్ రవి బాబు,డిటిసి ఇన్స్పెక్టర్ గోవింద రెడ్డి, జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ కమలాకర్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్యారసాని సురేష్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నర్సాపూర్ పర్యటనలో మాజీ మంత్రి హరీష్ రావు

నర్సాపూర్,మన ప్రజాపక్షం:మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ పర్యటనలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ హరీశ్ రావు కాగజ్ మద్దూర్ గ్రామంలో దయనీయమైన దృశ్యాన్ని చూసి చలించిపోయారు. స్థానిక నాయకురాలు సునీతా లక్ష్మారెడ్డితో కలిసి వెళ్తుండగా మార్గం మధ్యలో కరెంటు లేక ఎండిపోతున్న వరి పొలాలను చూసి పొలంలోకి వెళ్లి అక్కడున్న మహిళా రైతు నాగమణితో మాట్లాడి ఆమె కష్టాలను అడిగి తెలుసుకున్నారు.చిట్యాల నాగమణి అనే ఆ మహిళా రైతు హరీశ్ రావు ముందు తన ఆవేదనను వెళ్లగక్కింది. బోర్లలో నీళ్లున్నా ప్రభుత్వ చేతకానితనం వల్ల కరెంటు రాక పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయని వాపోయింది. సుమారు 60 వేల రూపాయల పెట్టుబడి పెట్టి మూడు ఎకరాల్లో వరి నాట్లు వేస్తే అందులో సగం పొలం పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది.పంట పొట్టకొచ్చే దశలో నీళ్లు అత్యంత అవసరమని, సరిగ్గా ఈ సమయంలోనే కరెంటు లేక రైతుల బతుకులు ఆగం అవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో పగటిపూట నిరంతరాయంగా కరెంటు వచ్చేదని, ఎలాంటి రంది లేకుండా పంటలు పండించుకున్నామని నాగమ్మ



గుర్తుచేసుకుంది. కానీ ఇప్పుడు కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొందని

వాపోయింది. ఉదయం 5 గంటలకు రావాల్సిన కరెంటు 8 గంటలకు వస్తోందని, ఆ వచ్చిన కరెంటు కూడా నిలకడగా ఉండకుండా మధ్యాహ్నం మళ్లీ కోతలకు గురవుతోందని వివరించింది.కేవలం కరెంటు కోతలే కాకుండా లో వోల్టేజ్ కారణంగా పదే పదే ఫ్యూజులు ఎగిరిపోతున్నాయని, మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతున్నాయని నాగమ్మ తెలిపింది.నెల రోజుల్లోనే మూడుసార్లు ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయిందని, రిపేర్ కోసం ఒక్కోసారి నాలుగు రోజుల పాటు కరెంటు లేక పొలాలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేసింది. కరెంటు వచ్చిపోవడం వల్ల పారిన మడే పారుతోందని, కింది మడులకు నీళ్లు అందడం లేదని తెలిపింది.నాగమ్మ ఒక్కరిదే కాదు, ఆ ప్రాంతంలోని రైతులందరి పరిస్థితి ఇలాగే కరెంటు లేక కాలిపోతోందని తెలుసుకున్న హరీశ్ రావు గారు రైతుల పరిస్థితి చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# అమూల్ ప్రారంభోత్సవానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**బ్రాహ్మణపల్లిలో ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**

మెదక్,మన ప్రజాపక్షం:మెదక్ జిల్లా బ్రాహ్మణపల్లిలో అమూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ నేపథ్యంలో శనివారం మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు బ్రాహ్మణపల్లిలోని కార్యక్రమ ప్రాంగణాన్ని పరిశీలించారు. కార్యక్రమానికి వచ్చే ప్రముఖుల రాకపోకలు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, బందోబస్తు విధులు తదితర ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై పోలీసు అధికారులతో సమీక్షించారు.వీఐపీల రాక సందర్భంగా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని,



వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. బందోబస్తులో విధులు నిర్వహించే సిబ్బందికి తమకు కేటాయించిన ప్రాంతాలపై పూర్తి అవగాహన ఉండాలని ఆదేశించారు.జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రముఖులు హాజరయ్యే నేపథ్యంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంట అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,డిఎస్పిలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్ర బోస్, సీఐలు వెంకట రాజా గౌడ్, సందీప్ రెడ్డి,ఆర్ఐ శైలందర్, రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

# డిజైన్ నుంచి ఎడిటింగ్ వరకు..
# విజయ్ కాటూరి సినీ ప్రస్థానం

**తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న చిలుకూరు గ్రామవాసి విజయ్ కాటూరి**



చిలుకూరు,మన ప్రజాపక్షం:సృజనాత్మకతకు టెక్నాలజీని జోడిస్తూ తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న యువ ప్రతిభావంతుల్లో చిలుకూరు గ్రామానికి చెందిన విజయ్ కాటూరి ఒకరు. సినిమా పోస్టర్ డిజైనర్‌గా, సినిమా ఎడిటర్‌గా తన ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్న ఆయన, తెలుగు సినిమాలతో పాటు కన్నడ చిత్ర పరిశ్రమలోనూ తన సేవలను అందిస్తున్నారు.సినిమా ప్రేక్షకుడికి ఒక చిత్రం గురించి మొదటి పరిచయం కలిగించేది పోస్టర్. ఆ పోస్టర్‌లో సినిమా కథ, పాత్రలు, భావోద్వేగం, కథానాయకుల ఇమేజ్‌ను ఆకట్టుకునేలా చూపించడం ఒక ప్రత్యేకమైన కళ. ఈ రంగంలో తన సృజనాత్మక ఆలోచనలతో విజయ్ కాటూరి ప్రత్యేక ముద్ర వేస్తున్నారు.పోస్టర్ డిజైనింగ్‌తో పాటు సినిమా



ఎడిటింగ్‌పై కూడా పట్టుసాధించిన విజయ్ కాటూరి ఒక సినిమాను ప్రేక్షకుడికి మరింత ఆసక్తికరంగా అందించడంలో ఎడిటింగ్ ప్రాధాన్యతను గుర్తిస్తూ తన పనితీరును కొనసాగిస్తున్నారు. డిజైన్, ఎడిటింగ్ అనే రెండు విభిన్న రంగాల్లో తన నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవడం ఆయన ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.తెలుగు చిత్ర పరిశ్రమలో పలు సినిమాలకు పనిచేసిన విజయ్ కాటూరి, కన్నడ చిత్ర పరిశ్రమలోనూ ఇప్పటివరకు 7 సినిమాలకు పనిచేసిన అనుభవాన్ని సొంతం చేసుకున్నారు. భాష మారినా సినిమా పట్ల ఉన్న అభిరుచి, సృజనాత్మకత, పనిపై నిబద్ధత తన



ప్రయాణానికి బలంగా నిలుస్తున్నాయని ఆయన చెబుతున్నారు.ప్రతి సినిమా ఒక కొత్త సవాలుగా భావిస్తూ, దర్శకులు మరియు నిర్మాతల ఆలోచనలకు అనుగుణంగా తన సృజనాత్మకతను జోడించడం విజయ్ కాటూరి పని విధానంలో ముఖ్యమైన అంశం. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ, మారుతున్న సినిమా ప్రమోషన్ ట్రెండ్‌లకు అనుగుణంగా తనను తాను అప్‌డేట్ చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు.పోస్టర్ డిజైనర్‌గా ప్రారంభమైన ప్రయాణం సినిమా ఎడిటర్‌గా మరో అడుగు ముందుకు తెలుగు నుంచి కన్నడ సినీ పరిశ్రమ వరకు విస్తరించిన విజయ్ కాటూరి ప్రస్థానం రాబోయే రోజుల్లో మరింత విస్తరించాలని, చిలుకూరు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటూ ఆకాంక్షిద్దాం.

# మీరు యావత్ ప్రపంచానికి హీరో..
# మా స్వాతంత్ర్య దినోత్సవానికి రండి..
# భారత పైలట్‌కు నెతన్యాహు అరుదైన ఆహ్వానం

విమానంలో సహ పైలట్ గొడ్డలితో దాడి చేసినా, అసాధారణ ధైర్యంతో పోరాడి వందలాది మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారత పైలట్ స్మిత్ మచ్చర్‌పై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నిన్న స్వయంగా కెప్టెన్ మచ్చర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఆయనను 'హీరో'గా అభివర్ణించడమే కాకుండా, ఇజ్రాయెల్ అత్యున్నత గౌరవానికి ఆహ్వానించారు."మీరు ఇజ్రాయెల్, భారత్, యావత్ ప్రపంచానికి హీరో" అని నెతన్యాహు కొనియాడారు. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో 'పవిత్ర జ్యోతిని వెలిగించాలని' మచ్చర్‌ను, ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఆహ్వానించారు. ఇది ఇజ్రాయెల్ తమ స్వాతంత్ర్య దినోత్సవాన అందించే అత్యున్నత గౌరవమని, సాధారణంగా ఇది కేవలం ఇజ్రాయెల్ పౌరులకు మాత్రమే దక్కుతుందని తెలిపారు. "ఈ విషయంలో ఇజ్రాయెల్ పౌరులందరూ మిమ్మల్ని అక్కున చేర్చుకుంటారని నేను భావిస్తున్నాను" అని నెతన్యాహు అన్నారు.

అసలేం జరిగింది?

గత సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానం ఖ్ఖీ1073లో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగా, ఒమన్‌కు చెందిన సహ పైలట్ హమామ్ అల్-హమామీ, కెప్టెన్ స్మిత్



మచ్చర్‌పై గొడ్డలితో దాడికి తెగబడ్డాడు. విమానాన్ని కూల్చివేయాలనే దురుద్దేశంతో ఈ దాడి చేసినట్టు తెలుస్తోంది. ఈ దాడి కారణంగా కేవలం రెండు నిమిషాల్లోనే విమానం 17,000 అడుగుల కంటే ఎక్కువ కిందకు దిగిపోయింది. దీంతో హైజాకింగ్ డిస్ట్రెస్ సిగ్నల్ పంపబడింది.సహ పైలట్ దాడిలో తీవ్రంగా గాయపడినప్పటికీ, కెప్టెన్ మచ్చర్ ధైర్యం కోల్పోకుండా పోరాడారు. తన సర్వశక్తులు ఒడ్డి కాక్‌పిట్ డోర్‌ను అన్‌లాక్ చేయగలిగారు. దీంతో ఇతర ప్రయాణికులు లోపలికి దూసుకువచ్చి దాడి చేస్తున్న సహ పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సాహసోపేత చర్యతో పెను ప్రమాదం తప్పింది.

నాలో చివరి పోరాటం మిగిలింది: కెప్టెన్ మచ్చర్

ఫోన్ సంభాషణలో అసలేం జరిగిందని నెతన్యాహు అడగ్గా, కెప్టెన్ మచ్చర్ ఆ భయానక క్షణాలను వివరించారు. "సహ పైలట్ ప్రార్థన చేసుకుంటానని చెప్పి వెళ్లాడు. నేను గమనించని సమయంలో నా తల వెనుక భాగంలో పెద్ద దెబ్బ తగిలింది. మొదట విమానంలో ఏదో సమస్య వచ్చిందేమో అనుకున్నాను. కానీ, ఒకదాని తర్వాత ఒకటి దెబ్బలు తగలడంతో నాతో పాటు కాక్‌పిట్‌లో ఉన్న వ్యక్తే దాడి చేస్తున్నాడని గ్రహించాను. అతడిని ఆపడానికి ప్రయత్నించాను, కానీ తొలి దెబ్బలకే నా కంటిచూపు దాదాపుగా మందగించింది" అని తెలిపారు."ఒకసారి డోర్ తెరవడానికి ప్రయత్నించగా, అతను దాన్ని మూసేశాడు. నాలో చివరిసారి పోరాడే శక్తి మిగిలి ఉంది. ఇప్పుడు ఇది చేయకపోతే చనిపోతాననిపించింది. నా శక్తి అంతా కూడగట్టుకుని డోర్ వైపు దూసుకెళ్లి దాన్ని తెరిచాను" అని మచ్చర్ వివరించారు.మచ్చర్ ధైర్యసాహసాలు విని నెతన్యాహు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "నిజాయితీగా చెబుతున్నా.. అసాధ్యమైన పరిస్థితుల్లో మీరు చూపిన ధైర్యం, విచక్షణ నన్ను ఆశ్చర్యపరిచింది. మీరు ఎంతో మంది ప్రాణాలను కాపాడారు. దయచేసి త్వరగా కోలుకోండి" అని ఆకాంక్షించారు. మచ్చర్ సాహసం వల్ల '9/11 తరహా పెను విపత్తు' తప్పిందని నెతన్యాహు వ్యాఖ్యానించారు.



## జిఓల అమలు ఏది?

**సర్కార్ వైఖరిపై ఆర్ఎంపీల సమరభేరి**

దిలావర్‌పూర్,మన ప్రజాపక్షం:
గ్రామీణ ప్రాంత ప్రజల ప్రాణాలు కాపాడుతున్న ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల పట్ల పాలకులు అనుసరిస్తున్న తీరుపై దిలావర్‌పూర్ మండల ఆర్ఎంపీ/పీఎంపీ అసోసియేషన్ నాయకులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ తక్షణమే శిక్షణనిచ్చి, అధికారికంగా గుర్తింపు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అరకొరగా ఉన్న పల్లెల్లో, అర్ధరాత్రి వేళల్లో సైతం ప్రాథమిక చికిత్స అందిస్తూ తమ జీవితాలను పణంగా పెడుతున్నామని స్పష్టం చేశారు. 2009లో జారీ చేసిన జీవో (జి.ఓ. నెం.1273/429) ప్రకారం శిక్షణ ఇచ్చి గుర్తింపు ఇస్తామన్న హామీ ఇప్పటికీ నెరవేరకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని నిలదీశారు.ఇప్పటికైనా ప్రభుత్వం కాలయాపన చొరవను పక్కనపెట్టి, అర్హులైన ఆర్ఎంపీ, పీఎంపీలకు తక్షణమే శిక్షణనిచ్చి గుర్తింపు ఇవ్వాలని, లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమ వినతిని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలని డిప్యూటీ తహసీల్దార్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శివశరణ్, కార్యదర్శి ధనంజయ్, ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య, కన్న సాయన్న, రవి, సంయుక్త కార్యదర్శిలు ప్రభాకర్, భీమేష్, సాయినాథ్, సురేందర్ రెడ్డి, సభ్యులు మురళి, సబ్జల్ అలీ, రమణారెడ్డి అశోక్, మోహన్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు వేరుశనగ ఉచిత పంపిణీ

**అభిరామి రైతు సంఘం**

నారాయణపేట,నారాయణపేట
మండలం కోటకొండ గ్రామంలోని అభిరామి రైతు సంఘం ఆధ్వర్యంలో చుట్టుపక్కల గ్రామాలైన తిరుమలాపూర్, అభంగాపూర్,బండగుండ, మేకన్నం తండా, ఊటకుంట తండా, గనిమోని బండ గ్రామాల రైతులకు అభిరామి రైతు సంఘం ఆధ్వర్యంలో ఉచిత వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులు కాంతు కుమార్, కోటకొండ గ్రామ సర్పంచ్ వెంకట్ రాములు గౌడ్, అభంగాపూర్ గ్రామ సర్పంచ్, రవికుమార్, అన్ని గ్రామాల సర్పంచులు,లక్ష్మయ్య, శ్రీధర్ రామచంద్ర,ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు చిట్టెం మాధవరెడ్డి, అభిరామి రైతు సంఘం డైరెక్టర్లు, యాదగిరి, చెవుల మల్లేష్, నర్సిరెడ్డి, నర్సింలు, నారాయణరెడ్డి నారాయణ, బాలకృష్ణప్ప, సీఈఓ వెంకటయ్య, శివకృష్ణ వెంకటయ్య, శ్రీను, మండల వ్యవసాయ అధికారి సుదర్శన్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## బస్తీ బాటలో ప్రజల సమస్యలపై ఆరా

**11వ వార్డు లో పర్యటించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ**

అచ్చంపేట,మన ప్రజాపక్షం:
అచ్చంపేట పట్టణంలోని 11వ వార్డు రాంనగర్ కాలనీ, గంగాభవాని వీధిలో బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను ప్రజలు వారి దృష్టికి తీసుకువచ్చారు.ఈ సమస్యలను మున్సిపల్ కమిషనర్ మురళి దృష్టికి తీసుకెళ్లి తక్షణమే చర్యలు చేపట్టి పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశించినట్లు తెలిపారు.కాలనీలో సీసీ రోడ్లు,డ్రైనేజీలు, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు, మంచినీటి సౌకర్యం వంటి మౌలిక వసతులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చి భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, అంతటి రజిత, మల్లేష్, మహమ్మద్ రఫీ,11వ వార్డు కౌన్సిలర్ మధు నాగుల సంధ్య, చందు కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీ రాములు, మద్దిమడుగు దేవస్థానం మాజీ చైర్మన్ విష్ణుమూర్తి, కాంగ్రెస్ యువజన నేత సాత్పాటి రవికుమార్, ఎం.డి. ఖాదర్, కాశన్న యాదవ్, గంగాభవాని కాలనీ అధ్యక్షుడు సునీల్ కుమార్ యాదవ్, రవికుమార్, వరదరాజు, శ్రీనివాస్, మేస్త్రి తిరుపతయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## కోర్టు కేసుల పురోగతిపై జిల్లా ఎస్పీ సమీక్ష

**కోర్టు డ్యూటీ అధికారులు, లైజన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

మహబూబ్ నగర్,మన ప్రజాపక్షం:

శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని ఎస్పీ ఛాంబర్‌లో కోర్టు డ్యూటీ అధికారులు మరియు కోర్టు లైజన్ అధికారులతో జిల్లా ఎస్పీ డి.జానకి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులకు సంబంధించి కోర్టు విచారణలు, పెండింగ్‌లో ఉన్న కేసులు, సాక్షుల హాజరు, చార్జిషీట్‌ల దాఖలు, కోర్టు ఉత్తర్వుల అమలు తదితర అంశాలపై ఎస్పీ సమీక్షించారు.కేసుల దర్యాప్తు పూర్తయిన అనంతరం చట్టపరమైన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, కోర్టుల్లో కేసుల విచారణ సజావుగా జరిగేలా కోర్టు డ్యూటీ అధికారులు, లైజన్ అధికారులు సంబంధిత పోలీసు అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కోర్టు కేసులకు సంబంధించిన రికార్డులు, డాక్యుమెంట్లు మరియు సాక్ష్యాలను పకడ్బందీగా నిర్వహించాలని, కోర్టు నుండి వచ్చే సమన్లు, వారెంట్లు, ఉత్తర్వులను సకాలంలో అమలు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు.న్యాయస్థానాల్లో కేసుల సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌కు అవసరమైన పూర్తి సహకారం అందిస్తూ, కేసుల్లో నిందితులకు చట్టపరమైన శిక్షలు పడేలా అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సూచించారు.ఈ సమావేశంలో ఆయన ఎస్పీ ఎన్.బి రత్నం, డిసిఆర్బి డిఎస్పీ రమణా రెడ్డి, వర్టికల్ డిఎస్పీ బాలాజీ,సీసీఎస్ ఇన్స్పెక్టర్ రవి బాబు,డిటిసీ ఇన్స్పెక్టర్ గోవింద రెడ్డి, కోర్టు డ్యూటీ అధికారులు మరియు కోర్టు లైజన్ అధికారులు పాల్గొన్నారు.



## క్రమశిక్షణ, దేహదారుఢ్యం, విధి నిర్వహణ సామర్థ్యం పెంపొందించేందుకు వీక్లీ పరేడ్

**ఆర్ఐ విజయ్ భాస్కర్**

నారాయణపేట,మన ప్రజాపక్షం:

నారాయణపేట జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో పోలీస్ సిబ్బందికి వీక్లీ పరేడ్‌ను ఆర్ఐ విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది పరేడ్‌లో భాగంగా మార్చ్‌పాస్ట్, డ్రిల్, శారీరక వ్యాయామాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్ఐ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వహించే ప్రతి సిబ్బందికి క్రమశిక్షణ, దేహదారుఢ్యం, సమయపాలన ఎంతో ముఖ్యమని తెలిపారు. వీక్లీ పరేడ్ ద్వారా సిబ్బందిలో శారీరక సామర్థ్యంతో పాటు మానసిక దృఢత్వం, సమన్వయం, క్రమశిక్షణ పెంపొందుతాయని పేర్కొన్నారు.ఈ పరేడ్ వల్ల పోలీస్ సిబ్బంది నిరంతరం ఫిట్‌గా ఉండటంతో పాటు విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులపై ఉన్న బాధ్యతను గుర్తించి అంకితభావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. అనంతరం సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని, విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులపై చర్చించారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, ప్రతిరోజూ శారీరక వ్యాయామం చేయాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు శివ శంకర్, శిరీష, ఏఆర్ మరియు సివిల్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ప్రియురాలిపై దాడి..భవనం పైనుంచి దూకి ప్రియుడి ఆత్మహత్య

నగరంలో ఓ ప్రేమ వ్యవహారం తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రేమించిన యువతి దక్కదేమోనన్న ఆవేదనతో ఓ యువకుడు ఆమెపై దాడి చేసి ప్రాణాలు తీశాడు. అనంతరం తాను కూడా భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణ ఘటన శనివారం ఉదయం న్యూ రాజరాజేశ్వరీపేటలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో పడవల మహాలక్ష్మి (19), మంకు చిన్నారావు (22) మృతి చెందారు.పోలీసుల కథనం ప్రకారం, శ్రీకాకుళం జిల్లాకు చెందిన చిన్నారావు పెయింటింగ్, ఫ్లవర్ డెకరేషన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం విజయవాడలోని తన అన్నయ్య ఇంటికి తరచూ వస్తుండేవాడు. ఈ క్రమంలో న్యూ రాజరాజేశ్వరీపేటలోని జేఎన్ఎన్యూఆర్ఎం నివాస సముదాయంలో నాయనమ్మతో కలిసి ఉంటున్న మహాలక్ష్మితో అతడికి రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. ఓ దుస్తుల దుకాణంలో పనిచేసే మహాలక్ష్మితో పరిచయం కాస్తా ప్రేమగా మారింది.ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నా, ఇరు కుటుంబాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇటీవల పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా జరిగింది. ఇకపై మహాలక్ష్మి జోలికి వెళ్లనని ఆ సమయంలో చిన్నారావు అంగీకరించినట్లు తెలుస్తోంది.ఈ క్రమంలోనే శనివారం ఉదయం 9:30 గంటల ప్రాంతంలో మహాలక్ష్మి ఇంటికి వెళ్లిన చిన్నారావు, ఆమెతో వాగ్వాదానికి దిగాడు. మాటామాటా పెరగడంతో ఆగ్రహంతో ఆమెపై దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన మహాలక్ష్మిని స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆమె మరణించింది. మరోవైపు, ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే చిన్నారావు సమీపంలోని ఓ భవనంపైకి ఎక్కి కిందకు దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు.సమాచారం అందుకున్న అజిత్‌సింగ్ నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై గతంలో తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. హత్య, ఆత్మహత్యగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



# ఇక ఆటోల వంతు.. కామన్ పాస్‌పై సర్కార్ కీలక ప్రకటన!

హైదరాబాద్ మహానగర ప్రయాణికులకు తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే లక్ష్యంతో, ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'కామన్ మొబిలిటీ కార్డు' (కామన్ పాస్) సేవలను త్వరలో ఆటోలకు కూడా విస్తరించాలని యోచిస్తోంది. ప్రస్తుతం మెట్రో, ఆర్టీసీ బస్సులకే పరిమితమైన ఈ పాస్ పరిధిలోకి ఆటోలను కూడా తీసుకురావడం ద్వారా నగరంలో రవాణా వ్యవస్థ స్వరూపాన్నే మార్చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కీలక విషయాన్ని స్వయంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.గురువారం కామన్ పాస్ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి భట్టి విక్రమార్క మెట్రో, బస్సులో ప్రయాణించారు. బేగంపేట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు మెట్రోలో, అక్కడి నుంచి సచివాలయం వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ.. సాధారణ



ప్రయాణికులతో ముచ్చటించారు. పాస్ వినియోగం, సౌకర్యాలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. "ప్రజలకు సులభమైన, సౌకర్యవంతమైన రవాణా అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. ఒకే కార్డుతో అన్ని రకాల ప్రజా రవాణా సేవలను పొందేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. భవిష్యత్తులో ఆటోలు, ఇతర రవాణా సాధనాలను కూడా ఈ కామన్ పాస్‌తో అనుసంధానిస్తాం" అని స్పష్టం చేశారు.

**ధరలపై సమీక్షిస్తాం: మంత్రి పొన్నం**

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి, పర్యావరణాన్ని పరిరక్షించాలంటే ప్రజా రవాణాను ప్రోత్సహించడమే మార్గమన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రోజువారీ పాస్ (రూ.400), నెలవారీ పాస్ (రూ.8,500) ధరలపై ప్రయాణికుల నుంచి వస్తున్న స్పందనను నిశితంగా గమనిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా నెలవారీ పాస్ ధర అధికంగా ఉందన్న అభిప్రాయాలపై ఆయన స్పందిస్తూ.. "ప్రయాణికుల నుంచి వచ్చే సూచనలు, సలహాలను స్వీకరించి, వారి స్పందన ఆధారంగా పాస్ ధరలపై తప్పకుండా సమీక్ష జరుపుతాం" అని హామీ ఇచ్చారు.రోజూ పరిమిత దూరం ప్రయాణించే తమకు నెలవారీ పాస్ ధర చాలా భారంగా ఉందని, ప్రస్తుతం అవుతున్న ఖర్చు కంటే ఇది రెట్టింపుగా ఉందని కొందరు ప్రయాణికులు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు.

# తెలంగాణలో సీనియర్ సిటిజన్లకు ఉచిత బస్ పాసులు!

తెలంగాణలోని సీనియర్ సిటిజన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వయోవృద్ధులకు కూడా వర్తింపజేసే ప్రతిపాదనను సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 1న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళలతో పాటు పురుషులతో సహా వయోవృద్ధులందరికీ ప్రయోజనం చేకూర్చేలా ఈ పథకాన్ని వీలైనంత త్వరగా అమలులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తే వృద్ధులు ఆసుపత్రులు,




పుణ్యక్షేత్రాలు, బంధువుల ఇళ్లకు సులువుగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది.అయితే, ఈ పథకానికి సంబంధించిన అర్హతలు, వయో పరిమితి, ఆదాయ పరిమితులు వంటి అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రభుత్వం త్వరలోనే దీనిపై పూర్తిస్థాయిలో చర్చించి మార్గదర్శకాలను ఖరారు చేయనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో వృద్ధుల జనాభా గణనీయంగా ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 32.69 లక్షలుగా ఉన్న వీరి సంఖ్య, ఇప్పుడు సుమారు 48 లక్షలకు (12.5 శాతం) చేరినట్లు అంచనా.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వృద్ధుల సంక్షేమానికి చేయూత పెన్షన్, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలు చేస్తోంది. అయితే, మహాలక్ష్మి పథకంతో ఇప్పటికే టీజీఎస్ఆర్టీసీపై ఆర్థిక భారం పడుతున్న నేపథ్యంలో, సీనియర్ సిటిజన్ల ఉచిత ప్రయాణంతో పడే అదనపు భారం, దానిని భర్తీ చేసే మార్గాలపై ప్రభుత్వం సమీక్ష జరుపుతోంది. అన్ని అంశాలను పరిశీలించి, విధివిధానాలు ఖరారు చేసిన తర్వాతే ఈ పథకం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

## 2027 క్యాలెండర్‌తో ఉద్యోగులకు నిరాశ..

# చాలా సెలవులు వారాంతాల్లోనే!




కొత్త సంవత్సరం క్యాలెండర్ రాగానే చాలామంది ఉద్యోగులు ముందుగా చూసేది సెలవుల జాబితానే. వరుస సెలవులు, లాంగ్ వీకెండ్స్ ఎప్పుడు వస్తున్నాయా అని లెక్కలు వేసుకుంటారు. అయితే, 2027 సంవత్సరం క్యాలెండర్ ఈ విషయంలో చాలా మంది కార్పొరేట్ ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసేలా ఉంది. ఎందుకంటే ఆ ఏడాదిలో వచ్చే అనేక ప్రధాన పండగలు, పబ్లిక్ హాలిడేస్ శని, ఆదివారాల్లోనే వస్తున్నాయి.2027 క్యాలెండర్ వివరాల ప్రకారం.. మార్చి 6న వచ్చే మహా శివరాత్రి శనివారం నాడు వస్తోంది. ఆగస్టు 15న జరుపుకునే స్వాతంత్ర్య దినోత్సవం ఆదివారం రానుంది. అలాగే, వినాయక చవితి పండగ సెప్టెంబర్ 4న (శనివారం), గాంధీ జయంతి అక్టోబర్ 2న (శనివారం), దసరా పండగ అక్టోబర్ 9న (శనివారం) రానున్నాయి. వీటితో పాటు నవంబర్ 14న గురునానక్ జయంతి ఆదివారం, డిసెంబర్ 25న క్రిస్మస్ శనివారం నాడు వస్తున్నాయి. ఇక, మహారాష్ట్ర డే వంటి ప్రాంతీయ సెలవు కూడా మే 1న శనివారమే రావడం గమనార్హం.సాధారణంగా సోమవారం లేదా శుక్రవారం సెలవు వస్తే, వారాంతపు సెలవులతో కలుపుకొని మూడు రోజుల పాటు లాంగ్ వీకెండ్ లభిస్తుంది. దీంతో ఉద్యోగులు విహార యాత్రలు, సొంత ఊళ్లకు ప్రయాణాలు ప్లాన్ చేసుకుంటారు. అయితే, 2027లో ఈ అవకాశాలు గణనీయంగా తగ్గనున్నాయి. ఈ సెలవుల జాబితాతో కూడిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోంది. చాలా మంది ఉద్యోగులు 2027ని 'సవాలుతో కూడిన సంవత్సరం'గా అభివర్ణిస్తూ కామెంట్లు పెడుతున్నారు.అయితే, ఈ ప్రభావం ప్రధానంగా సోమవారం నుంచి శుక్రవారం వరకు పనిచేసే ఉద్యోగులపైనే ఎక్కువగా ఉంటుంది. కొన్ని సంస్థలు తమ ఉద్యోగులకు వారాంతాల్లో పబ్లిక్ హాలిడే వస్తే, దానికి బదులుగా మరో రోజు కాంపెన్సేటరీ సెలవును ఇచ్చే విధానాన్ని పాటిస్తుంటాయి. కానీ, అన్ని కంపెనీలలో ఈ వెసులుబాటు ఉండదు. మొత్తం మీద 2027లో ఉద్యోగులు తమ ట్రిప్స్ కోసం వ్యక్తిగత సెలవులను మరింత జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవాల్సి ఉంటుంది.

# బన్నీ-అట్లీ సినిమా పుకార్లకు చెక్ పెట్టిన ఐశ్వర్య లక్ష్మి



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రాబోతున్న పాన్-ఇండియా చిత్రం 'రాకా'పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో సినిమా క్యాస్టింగ్‌కు సంబంధించి వస్తున్న ఊహాగానాలకు నటి ఐశ్వర్య లక్ష్మి తెరదించారు. ఈ చిత్రంలో తాను నటిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆమె స్పష్టం చేశారు.గత కొన్ని రోజులుగా 'రాకా' చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి ఒక కీలక పాత్రలో, ముఖ్యంగా నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతున్నారంటూ ప్రచారం జోరుగా సాగింది. ఈ పుకార్లపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించిన ఆమె, "నేను ఆ సినిమాలో భాగం కాదు. దయచేసి ఎవరైనా నన్ను ఆ సినిమాలో తీసుకోండి" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఆమె వివరణతో ఈ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడినట్లయింది.అల్లు అర్జున్-అట్లీ కాంబోలో వస్తున్న తొలి సినిమా కావడంతో 'రాకా'పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇందులో దీపికా పదుకొణె నటిస్తున్నట్లు ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. వీరితో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్, రష్మిక మందన్న వంటి తారల పేర్లు కూడా పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తున్నాయి.ప్రస్తుతం ఐశ్వర్య లక్ష్మి, అర్జున్ దాస్‌తో కలిసి నటించిన రొమాంటిక్ కామెడీ సిరీస్ 'లవ్'లో నటిస్తున్నారు. 'పాన్నియిన్ సెల్వన్' వంటి చిత్రాలతో ఈమె చాలా గుర్తింపు పొందారు.

### ఆరంభంలో వెనుకంజ.. చివర్లో పతకాల పంజా!

# ఆసియా క్రీడల్లో భారత్ జోరు



రెండు రోజుల క్రితం పతకాల పట్టికలో భారత్ టాప్-10లో కూడా లేదు. తర్వాత పుంజుకొని టాప్-5లోకి దూసుకొచ్చింది. ఆరంభంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా.. చివరి రెండు రోజుల్లో భారత క్రీడాకారులు అద్భుతాలు చేశారు. వరుసగా స్వర్ణాలు సాధిస్తూ పతకాల వేటలో కొత్త ఊపు తీసుకొచ్చారు. హాకీ, క్రికెట్ నుంచి ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్ వరకు సత్తా చాటారు. మొత్తంగా 21 స్వర్ణాలు సహా 85 పతకాలతో ఆసియా క్రీడల ప్రస్థానాన్ని 4వ స్థానంతో ముగించారు. కొన్ని విభాగాల్లో నిరాశ ఎదురైనా.. మరికొన్ని క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు.

చివర్లో ఒక్కసారిగా జోరు!

ఆసియా క్రీడల్లో భారత్ ప్రస్థానం ఒడుదొడుకులతో సాగింది. గురువారం నాటికి ఖాతాలో 10 స్వర్ణాలు మాత్రమే ఉన్నాయి. పతకాల పట్టికలో టాప్-10 కింద నిలిచింది. అయితే చివరి రెండు రోజుల్లో సీన్ మారిపోయింది. క్రికెట్, హాకీ జట్లు పసిడి పతకాలు సాధించాయి. ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్‌లోనూ భారత క్రీడాకారులు మెరిశారు. దీంతో చివరి రెండు రోజుల్లోనే మరో 11 స్వర్ణాలు ఖాతాలో చేరాయి. భారత్ టాప్-5లోకి దూసుకొచ్చింది.

హాకీలో చరిత్ర.. క్రికెట్‌లోనూ పసిడి

ఈసారి భారత హాకీ జట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల జట్టు 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం గెలుచుకుంది. పురుషుల జట్టు కూడా మలేసియాపై 5-1తో ఘన విజయం సాధించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఒకే ఆసియా క్రీడల్లో పురుషులు, మహిళల జట్లు స్వర్ణాలు గెలవడం ఇదే తొలిసారి. ఈ విజయాలతో రెండు జట్లూ 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించాయి. క్రికెట్‌లోనూ పురుషులు, మహిళలు స్వర్ణాలు గెలిచి భారత్ ఖాతాలో పసిడి పతకాలు జమ చేశారు. కబడ్డీలోనూ ఇరు జట్లు స్వర్ణ విజేతలుగా నిలిచాయి.

ఆర్చరీలో అమ్మాయిల అదుర్స్!

ఆర్చరీలో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేశారు. ఈ విభాగంలో ఐదు స్వర్ణాలు సహా మొత్తం 9 పతకాలు సాధించారు. మహిళల వ్యక్తిగత రికర్వ్‌లో 17 ఏళ్ల కుమ్‌కుమ్ స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించింది. ఆసియా క్రీడల్లో ఈ విభాగంలో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళగా నిలిచింది. మహిళల రికర్వ్ జట్టు కూడా తొలిసారి పసిడి పతకాన్ని అందుకుంది. నీరు ధండా షూటింగ్‌లో మహిళల ట్రాప్ విభాగంలో స్వర్ణం గెలిచి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. గోల్ఫ్‌లో ప్రణవి ఉర్స్ వ్యక్తిగత స్వర్ణంతో మెరిసింది.

అథ్లెటిక్స్‌లో అత్యధిక పతకాలు

భారత్‌కు అత్యధిక పతకాలు అందించింది అథ్లెటిక్సే. ఈ విభాగంలో 24 పతకాలు వచ్చాయి. ఒక స్వర్ణం, 9 రజతాలు, 14 కాంస్యాలు దక్కాయి. షూటింగ్‌లో 15, ఆర్చరీలో 9 పతకాలు లభించాయి. బాక్సింగ్, రెజ్లింగ్‌లో చెరో ఆరు పతకాలు వచ్చాయి. రెజ్లింగ్‌లో అమన్ సెహ్రావత్, సుజీత్ కల్కల్ స్వర్ణాలు సాధించగా.. లవ్లీనా బోర్గోహెయిన్, పర్వీన్ హూడా, అంకుశ్ పంఘాల్ బాక్సింగ్‌లో పసిడి పతకాలు గెలిచారు.

గతంతో పోలిస్తే తగ్గిన పతకాలు

గత ఆసియా క్రీడలతో పోలిస్తే ఈసారి భారత్ పతకాల సంఖ్య తగ్గింది. 2022 హాంగ్‌జౌ క్రీడల్లో 106 పతకాలు సాధించిన భారత్.. ఈసారి 85 పతకాలకే పరిమితమైంది. స్వర్ణాల సంఖ్య కూడా 28 నుంచి 21కి పడిపోయింది. ముఖ్యంగా షూటింగ్‌లో ఏడు స్వర్ణాల నుంచి మూడింటికి తగ్గాయి. అథ్లెటిక్స్‌లో గతంలో ఆరు స్వర్ణాలు సాధించగా.. ఈసారి ఒక్క పసిడి మాత్రమే దక్కింది. రోయింగ్, బ్యాడ్మింటన్‌లోనూ పతకాలు తగ్గాయి. టెన్నిస్, ఈక్వెస్ట్రియన్‌లో ఈసారి ఒక్క పతకం కూడా రాలేదు.

కొత్త రికార్డులు.. మరింత ఉత్సాహం

పతకాల సంఖ్య తగ్గినా.. ఈసారి పలువురు భారత క్రీడాకారులు వ్యక్తిగతంగా చరిత్ర సృష్టించారు. మహిళల హాకీ జట్టు నాలుగు దశాబ్దాలకు పైగా ఎదురుచూసిన స్వర్ణాన్ని అందుకుంది. ఆర్చరీ, గోల్ఫ్, షూటింగ్, రెజ్లింగ్‌లో కొత్త రికార్డులు నమోదయ్యాయి. మొత్తంగా 20 క్రీడాంశాల్లో పతకాలు సాధించిన భారత్.. చివరి వరకు పోరాడి టాప్-5లో నిలిచింది. కొన్ని విభాగాల్లో వెనుకబడినా.. మరికొన్ని క్రీడల్లో సాధించిన అపూర్వ విజయాలు ఈ ఆసియా క్రీడలను భారత క్రీడాభిమానులకు ప్రత్యేకంగా గుర్తుండిపోయేలా చేశాయి.

అగ్రస్థానంలో చైనా

పతకాల పట్టికలో చైనా మరోసారి అగ్రస్థానంలో నిలిచింది. ఆ దేశం ఏకంగా 169 స్వర్ణాలు, 89 రజతాలు, 83 కాంస్యాలతో మొత్తం 341 పతకాలు సాధించింది. ఆ తర్వాత ఆతిథ్య జపాన్ 83 స్వర్ణాలు, 95 రజతాలు, 91 కాంస్యాలతో 269 పతకాలతో రెండో స్థానంలో నిలిచింది. దక్షిణ కొరియా 39 స్వర్ణాలు, 43 రజతాలు, 68 కాంస్యాలతో 150 పతకాలతో మూడో స్థానంలో ఉంది. భారత్ 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో 85 పతకాలు సాధించి నాలుగో స్థానంలో నిలిచింది. ఉజ్బెకిస్థాన్ 21 స్వర్ణాలు, 25 రజతాలు, 24 కాంస్యాలతో 70 పతకాలతో ఐదో స్థానంలో ఉంది.

# SPORTS

### ఆసియా క్రీడల క్రికెట్ విజేత టీమిండియా...

## ఇది దేశానికే ఆనందకరమన్న ప్రధాని మోదీ



ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో భారత జట్టు మరోసారి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడం తెలిసిందే. జపాన్‌లోని నిషిన్‌లో శనివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో పసిడిని నిలబెట్టుకుని సత్తా చాటింది.ఈ అద్భుత విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ భారత జట్టును అభినందించారు. ఇది దేశానికి ఎంతో ఆనందకరమైన సందర్భమని కొనియాడారు. "భారత్‌కు మళ్లీ స్వర్ణం దక్కింది! ఆసియా క్రీడల్లో టైటిల్ నిలబెట్టుకున్న మన పురుషుల క్రికెట్ జట్టుకు అభినందనలు. భవిష్యత్తులోనూ జట్టు సభ్యులు మరిన్ని విజయాలు సాధించాలి" అని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. అంతకుముందు, ఐసీసీ చైర్మన్ జై షా కూడా జట్టును అభినందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ భారీ స్కోరు సాధించింది. అభిషేక్ శర్మ కేవలం 28 బంతుల్లో 61 పరుగులతో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. పాకిస్థాన్‌పై టీ20ల్లో ఒక భారత బ్యాటర్ చేసిన వేగవంతమైన అర్ధ సెంచరీ ఇదే. ఆ తర్వాత తిలక్ వర్మ 22 బంతుల్లోనే 51 పరుగులతో అజేయంగా నిలిచి స్కోరును పరుగులు పెట్టించాడు. వీరితో పాటు వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, శివమ్ దూబే కూడా రాణించడంతో భారత్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది.అనంతరం 212 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ కూడా గట్టిగా పోరాడింది. ఆ జట్టు బ్యాటర్ హసన్ నవాజ్ 51 బంతుల్లో 96 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. ఒక దశలో పాకిస్థాన్ గెలుపు దిశగా సాగుతున్నట్టు కనిపించినా, భారత బౌలర్లు చివరిలో ఒత్తిడిని జయించారు. కీలక సమయంలో వికెట్లు తీసి మ్యాచ్‌ను అదుపులోకి తెచ్చుకున్నారు. చివరి బంతికి నవాజ్‌ను శివమ్ దూబే ఔట్ చేయడంతో పాకిస్థాన్ ఇన్నింగ్స్ 6 వికెట్ల నష్టానికి 192 పరుగుల వద్ద ముగిసింది. దీంతో భారత ఆటగాళ్లు సంబరాల్లో మునిగిపోయారు.